
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 10 ఏప్రిల్ 2024



వేడుకగా.. శ్రీక్రోధి

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం
- ప్రముఖులకు, కళాకారులకు ఉగాది పురస్కారాలు

నరసరావుపేట, ఏప్రిల్ 9: తెలుగు వారి నూతన సంవత్సరం శ్రీక్రోధి నామ ఉగాది వేడుకలు మంగళవారం వేడుకగా జరిగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు పెద్దఎత్తున జరిగాయి. ప్రజలు ఉగాది పర్వదినాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ కూడళ్లు, సంస్థల కార్యాలయాల్లో కూడా ఉగాది వేడుకలను నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఆలయాల్లో వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, విశిష్ట సేవలందించిన ప్రముఖులకు, కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించారు. ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు జరుపుకున్నారు. ఇళ్లల్లో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా నూతన వస్త్రాలను ధరించి ఇంటి గడపలను మామిడి తోరణాలతో అలంకరించి ఇష్ట దైవాలకు పూజలు చేసి ఉగాది పచ్చడిని ప్రసాదంగా తీసుకున్నారు. ఉగాది సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దేవాలయాల్లో షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. నూతన పంచాంగాన్ని భక్తులను పంపిణీ చేశారు. ఉగాదిని పురస్కరించుకుని దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవాలయాలు, రచ్చబండలు, ప్రధాన కూడళ్లల్లో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తమ రాశి ఫలాల గురించి ఆసక్తికరంగా పురోహితులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కుటుంబ సభ్యుల్లో మంచి రాశి ఫలం ఉన్న వారిచే వ్యవసాయ పనులను ప్రారంభించాలని పండితులు రైతులకు సూచించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులచే పంచాంగ శ్రవణం చేయించారు.



అమరేశ్వర ఆలయంలో పంచాగ శ్రవణం చేస్తున్న వేద పండితులు



సాతులూరులోని దేవాలయంలో బారులు తీరిన భక్తులు





చౌకగా.. బియ్యం మాత్రమే

చౌక దుకాణాలు.. టీడీపీ హయాంలో మినీ మాల్స్‌లా ఉండేవి. బియ్యం, పంచదార, పామాయిల్, గోధుమ, కందిపప్పులతో పాటు ప్రజలకు అవసరమైన పలు రకాల వస్తువుల విక్రయాలతో కళకళలాడేవి. మార్కెట్ కంటే తక్కువ ధరలకు ఉప్పు పప్పుల నుంచి సబ్బులు, నూనెలు, గోధుమ పిండి తదితరాలు ఎన్నో అందుబాటులో ఉండేవి. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేక ఇబ్బందిపడే సరుకులను కూడా సబ్సిడీతో చౌక దుకాణాల్లో కార్డుదారులకు ప్రభుత్వం అందించేది. ఇక పండుగల సమయాల్లో ప్రత్యేకంగా సరుకులను చౌక దుకాణాల ద్వారా కానుకల రూపంలో పంపిణీ జరిగేది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత రేషన్ వ్యవస్థను సంస్కరిస్తున్నామంటూ భ్రష్టు పట్టించేశారు. రేషన్ అంటే బియ్యం మాత్రమే అన్నట్లుగా మార్చేసింది. కందిపప్పు, పంచదార అర కొరగానే పంపిణీ చేస్తుంది. మార్కెట్లో అందుబాటులో లే కుండా విపరీతంగా ధరలు పెరిగిపోయి సామాన్యులు విలవిల్లాడుతున్నా తమకు సంబంధం లేదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందే కాని ఆయా సరుకులను సబ్సిడీపై అందించాలన్న కనీస ఆలోచన చేయడం లేదు. ఇలా పౌరసరఫరాల వ్యవస్థను పూర్తిగా దిగజార్చడంపై ఎన్ని విమర్శలు వస్తున్నా వైసీపీ పాలకులు పట్టించుకోవడంలేదు.

- రేషన్ సరుకుల్లో కోతలు
- నామమాత్రంగానే సరుకుల పంపిణీ
- పామాయిల్, గోధుమ పూర్తిగా కనుమరుగు
- లబ్ధిదారులపై పెరిగిన నెలవారీ ఆర్థిక భారం
- ఐదేళ్లుగా దిగజారిపోయిన పౌరసరఫరాల వ్యవస్థ

గుంటూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ వచ్చి రేషన్ బియ్యం అందజేస్తాం అంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో పౌరసరఫరాల వ్యవస్థను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. ఐదేళ్ల క్రితం తొలిగా మొబైల్ డిస్పెన్సరీ వాహనాలతో హడావుడి చేసింది. ఆ పేరుతో అప్పటి వరకూ పేదలకు అందే నిత్యావసర సరుకులను వారికి ఇవ్వకుండా చేసిందన్న విమర్శలు వచ్చాయి. అప్పటి వరకూ పేదలకు బియ్యం పంచదారతోపాటు అందుతూ వచ్చిన కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి వంటి సరుకులు వారికి అందకుండా పోయాయి. కరోనా తర్వాత నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ జరుగుతోంది. కందిపప్పు నూటికి 30 కుటుంబాలకు, గోధుమపిండి నూటికి 15 కుటుంబాలకు మాత్రమే అందుతోంది. దీంతో లబ్ధిదారులపై నెలవారీ ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోయింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వాటి ద్వారా మూడు జిల్లాలో సుమారు 50 లక్షల మందికి రేషన్ సరుకులు అందిస్తారు. ప్రతి నెలా మనిషికి 5 కిలోల బియ్యంతో పాటు, అరకిలో పంచదార, కిలో కందిపప్పు చౌక ధరలకు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం క్రమంగా వాటిని తగ్గిస్తూ వచ్చింది. ఒక్క బియ్యం మినహా మిగిలిన సరుకులకు రకరకాల కారణాలతో కోత విధించారు. 2022 నుంచి పంచదార, కందిపప్పు సరఫరా పడిపోయింది. కందిపప్పు సరఫరా మూడొంతులు తగ్గింది. ఎన్నికలు సమీపించే సమయానికి లబ్ధిదారులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో భాగంగా తిరిగి కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం స్వీకారం చుట్టింది. పండుగ నెలలైన డిసెంబరు, జనవరిలో కూడా కార్డుదారులకు కందిపప్పు అందించలేక అబాసుపాలైంది. కాగా గోధుమ పిండి సరఫరా చేస్తామని హడావుడి చేసిన ప్రభుత్వం అందులోనూ చేతులెత్తేసింది. నూటికి 15 కుటుంబాలకు కూడా గోధుమపిండి సరఫరా చేయలేక గుడ్లు తేలేసింది. అంతగా పౌర సరఫరాల శాఖ పరిస్థితి దిగజారింది. ఒకానొక దశలో నెలల తరబడి అర కిలో పంచదార కూడా సరఫరా చేయలేకపోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

1700 టన్నుల నుంచి 4 టన్నులకు..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని కార్డుదారులకు గతంలో 1700 టన్నుల కందిపప్పు సరఫరా జరిగేది. అయితే వైసీపీ ప్రభుత్వం కోత విధించుకుంటూ దానిని 4 టన్నులకు పరిమితం చేసింది. ఆ కందిపప్పును కూడా పౌర సరఫరాల శాఖ ప్రతీ నెలా సరఫరా చేయలేకపోతోంది. ఫలితంగా నూటికి 70 కుటుంబాలకు కందిపప్పు అందకుండానే పోతోంది. 2023కు వచ్చే సరికి పరిస్థితి మరింత దిగజారిపోయింది. జూలైలో 17 లక్షల కిలోలకు ప్రభుత్వం 935 కిలోలు మాత్రమే కందిపప్పును సరఫరా చేసింది. ఆగస్టులో పల్నాడు జిల్లాలోని 6లక్షల 36 వేల కుటుంబాలకు 12 కిలోల కందిపప్పు పంపిణీ చేసింది. దీనినిబట్టి పౌర సరఫరాల వ్యవస్థ ఎంతగా కుదేలైపోయిందో తెలిపోతోంది.

కోతలతో పాటు పెరిగిన ధరలు

వైసీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకూ రేషన్ సరుకుల్లో భారీగా కోత పడింది. టీడీపీ హయాంలో 2018 మార్చి నుంచి ఒక్కో కుటుంబానికి 2 కిలోల కందిపప్పు రూ.40 చొప్పున ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం దానిలో కోత పెట్టి కిలోకి తగ్గించింది. ధరను రూ.40 నుంచి రూ.67కి పెంచింది. అయినప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కో కుటుంబానికి కిలో పంచదార రూ.20 చొప్పున అందించేది. దాన్నీ ఈ ప్రభుత్వం అరకిలోకి తగ్గించి రూ.17 వసూలు చేస్తోంది. అంటే కిలోకు రూ.14 పెంచినా అది కూడా అరకొర సరఫరా చేస్తున్నారు. 2018-19లో రాగులు, జొన్నలు, గోధుమపిండి, ఉప్పు తదితరాలను లబ్ధిదారులకు రేషన్ సరుకులతో పాటు పంపిణీ చేశారు. దాంతోపాటు పండుగ సమయాల్లో, నూనె ధరలు అధికంగా ఉన్న సమయంలో పామాయిల్‌ను సబ్సిడీ ద్వారా కిలో రూ.40 పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వంట నూనెల ధరలు మూడంకెల సంఖ్యను చేరినా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం వంట నూనె ఇచ్చిన దాఖలాలు లేవు. పైపెచ్చు ప్రతి ఏటా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు, తోఫాలను పూర్తిగా ఆపేసి చేతులు దులుపుకుంది.

సామాన్యులపై పెరిగిన భారం

బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులే ఆధారం. ఆకాశాన్నంటుతున్న సరుకుల ధరలు, అంతంత మాత్రం సంపాదనలో పేదల ఆకలి తీర్చేది ప్రభుత్వం అందించే రేషన్ మాత్రమే. కానీ ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కోలుకోలేనంతగా దెబ్బతీసింది. నూటికి పది మందికి ఒకటి, అరా సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. దీంతో వారంతా బహిరంగ మార్కెట్లో సరుకులను కొనుక్కోవాల్సి వస్తోంది. కందిపప్పు కిలో రూ.160, వంట నూనె కిలో రూ.110, గోధుమపిండి కిలో 70, పంచదార కిలో రూ.45 ఉన్న నేపథ్యంలో అవి రేషన్ షాపుల్లో చౌక ధరలకు లభ్యమైతే వారిపై భారం తగ్గేది. అయితే ఆయా సరుకులు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయని కారణంగా వారు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుక్కో వాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో కుటుంబంపై సగటున నెలకు 500 నుంచి రూ.వెయ్యి మేర అదనపు భారం పడు తోంది. ఈ భారం మోయ లేక జన సామాన్యం తీవ్ర ఇబ్బందులు పడుతోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.27(బుధవారం)
సహారీ (ఉదయం) -- (గురువారం)

వైసీపీ ఉచ్చులో.. వలంటీర్లు

- వారి భవిష్యత్‌తో నేతల చెలగాటం
- ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ప్రచారాలు
- రెచ్చగొట్టి మూకుమ్మడిగా రాజీనామాలు
- వలంటీర్లపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి





పల్నాడు జిల్లాలో ఇటీవల రాజీనామాలు చేసిన వలంటీర్లు

బాపట్ల, ప్రత్తిపాడు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ప్రజా ధనం నుంచి గౌరవ వేతనాలు తీసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.. ఇది కరెక్ట్ కాదు... అని ప్రతిపక్ష నాయకులతో పాటు ఎన్నికల సంఘం కూడా చెప్తోంది. అయితే ఇదేమీ పట్టని కొందరు వలంటీర్లు వైసీపీ నాయకులు చెప్పినట్లుగా చేస్తూ వస్తోన్నారు. మొత్తంమీద అధికార పార్టీ నేతల ఉచ్చులో వలంటీర్లు పడిపోతున్నారు. వలంటీర్ల భవిష్యత్‌తో వైసీపీ చెలగాటమాడుతోందన్న విమర్శలు కూడా వస్తున్నాయి. కోడ్ అమలులో భాగంగా ఎన్నికల సంఘం తీసుకుంటున్న నిర్ణయాలకు వైసీపీ రాజకీయ జోక్యాన్ని అంటగడుతుం ది. మొన్నటి వరకు కోడ్ ఉల్లంఘించేలా ప్రచారంలో భాగస్వామ్యం చేసి వలంటీర్లు సస్పెన్షన్‌కు గురి కావడానికి పరోక్షంగా వైసీపీ నేతలే కారణమ య్యారన్న ఆరోపణలున్నాయి. నిష్పక్షపాతంగా వ్యవహరించే వలంటీర్లకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని టీడీపీ నేతలు గతంలోనే చెప్పి ఉన్న సంగతి తెలిసిందే. కానీ కోడ్ అమల్లోకి వచ్చాక కొంతమంది వలంటీర్లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో నిబంధనల ప్రకారం అధి కారులు వారిమీద చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ చర్యలను టీడీపీకి ఆపాదిస్తూ వారిని మరింత రెచ్చగొట్టి ఓట్ల పబ్బం గడుపుకో వాలని వైసీపీ చూస్తోంది. తాజాగా సామాజిక పింఛన్ల పంపిణీలో ఈసీ ఆదేశాలకు వక్రభాష్యం చెబుతూ వలంటీర్లను రెచ్చగొడుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలను మసిపూసి మారేడు కాయ చేస్తూ వలం టీర్లను రాజకీయ క్రీడలో పావులుగా వాడుకోవడంపై టీడీపీ మండిపడు తోంది. వలంటీర్లకు టీడీపీ వ్యతిరేకమనే బోగస్ ప్రచారాన్ని వైసీపీ నేతలు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఈసీ కన్ను వలంటీర్‌ల మీద ఉందని తెలిసినా వారిని లొంగదీసుకుని ఎన్నికల ప్రచారంలో భాగస్వాములను చేస్తూ వారి సస్పెన్షన్‌కు కారణమయ్యారు. ఇప్పుడేమో వారిని రాజీ నామాలు చేయమని వైసీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నా రు. వారిని రెచ్చగొట్టి పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారానికి వాడుకునే దు ర్మార్గ క్రీడకు వైసీపీ పూనుకుం టోందగా దానిని పసిగట్ట లేని పలు వురు వారి ఉచ్చులో పడుతున్నారు. ఈ క్రమంలో వారి భవిష్యత్ ఏమైనా పర్వాలేదనే రీతిలో అధికార పార్టీ నేతల వ్యవహార శైలి ఉండడం గమనార్హం. వలంటీర్లలో చాలా మంది డిగ్రీ, పీజీలు చేసిన వారు కూడా ఉన్నారు. నిబంధనలు అతిక్రమించడంతో ఈసీ ఆదేశాల మేరకు పలువురిపై వేటు పడుతోంది. భవిష్యత్‌లో వారి ఉన్నతికి ఇది శాపంగా పరిణమించే అవ కాశం ఉందనే ఆవేదనను పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అతిక్రమించి వైసీపీ నేతలతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, గ్రూపులలో సదరు నేతలకు అనుకూలంగా ప్రచారం చేయ డం వంటి అంశాల తో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 30 మందికి పైగా సస్పెన్షన్‌కు గురయ్యారు. కర్లపాలెం మండల పరిధిలో వైసీపీకి అనుకూలంగా ప్రచా రం చేసినందుకు ఓ మహిళా వలంటీర్‌పై ప్రభుత్వం గతంలోనే వేటు వేసింది. బల్లికురవ మండల పరిధిలో వైసీపీ నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నందుకు మరో ఇద్దరి వలంటీర్లపై చర్య తీసుకున్నారు. ఇవన్నీ పూర్తిగా కోడ్ ఉల్లంఘన కిందకు రావడం వల్లే అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే ఈ సస్పెన్షన్లకు కారణం టీడీపీయే అంటూ మరి కొంతమంది వలంటీర్లను తమ ఉచ్చులోకి లాగే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. ఇక పెన్షన్లు అందించే విషయంలో ఈసీ నిర్ణయానికి వక్రభాష్యం చెబుతూ వలంటీర్ల చేత రాజీనామాలు చేసే విధంగా వారిపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది వలంటీర్ల చేత రాజీనామాలు చేయించి రాజకీయ క్రీడలోకి వారిని లాగుతున్నారు. వలంటీర్ల గౌరవవేతనం పెంచడంతో పాటు వారి ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండబోదని ఇప్పటికే పలు సందర్భాల్లో టీడీపీ ప్రకటించి ఉంది. వలంటీర్ల పేదరికాన్ని ఆసరాగా చేసుకుని అధికారుల ముందు వారిని దోషులుగా నిలబెడుతున్నారంటున్నారు.

నాడు హీరోలు.. నేడు జీరోలు

నిన్న మొన్నటి వరకు వలంటీర్లను అధికార పార్టీ హీరోలుగా చిత్రీకరించింది. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించడంలో వారిదే కీలకపాత్ర. అటు పార్టీ శ్రేణులు, ఇటు ప్రభుత్వ ఉద్యోగులకంటే వీరిదే తుది నిర్ణయం. వారి సేవలను కీర్తిస్తూ పురస్కారాలను కూడా అందించారు. అలాంటి వలంటీర్లను ఇప్పుడు జీరోలను చేస్తున్నారు. తమ రాజకీయ లబ్ధి కోసం వారిని పావులుగా వాడుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీని బూచిగా చూపిస్తూ వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నాయకుల కనుసన్నల్లో రాజీనామాల కుతంత్రం జరుగుతుంది. వలంటీర్ల మండల లెవల్ అధికారుల గ్రూపులలో డైరెక్టుగా మెసేజ్ పెడుతూ రాజీనామాలపై వత్తిడి చేస్తున్నారు. అంతేకాకుండా స్థానిక నాయకులు కూడా వలంటీర్ల చేత రాజీనామాలు చేయించే పనిలో పడ్డారు. మరలా మన పార్టీ వస్తుంది.. అప్పుడు మిమ్మల్నే వలంటీర్లుగా నియమిస్తాం.. ముందు మీరు రాజీనామా చేయండి అంటూ హుకుంలు జారీ చేస్తున్నారు. తాజాగా ప్రత్తిపాడులో 65 మంది వలంటీర్లు ఉండగా వారిలో 59 మంది మూకుమ్మడిగా రాజీనామా చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వట్టిచెరుకూరు మండలం గారపాడు, కుర్నూతల గ్రామాలలో వలంటీర్లు కొందరు రాజీనామా చేశారు. ఇదే రీతిలో మిగిలిన గ్రామాల్లో కూడా వలంటీర్ల చేత రాజీనామా చేయించే పనిలో వైసీపీ నాయకులు ఉన్నారు.

వాటా.. మాటేమిటి?

- పట్టణాల్లో నీటి పథకాల పనులు నిలిపివేత
- కేంద్రం ఇచ్చే నిధులు రాష్ట్ర ఖజానాలోకి
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి

నరసరావుపేట, ఏప్రిల్ 9: తాగు నీటి పథకాలకు నిధులు లేవు.. ఐదేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సొమ్ము ఇవ్వకపోగా కేంద్రం ఇచ్చిన నిధులను వినియోగించుకోవడంతో పనులు ముందుకు సాగలేదు. అమృత్ పథకంలో చిలకలూరిపేట, ఆసియా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల మునిసిపాల్టీలలో చేపట్టిన తాగునీటి పథకాల విస్తరణ పనులు అటకెక్కాయి. నీటి పథకాల పనులు పూర్తి కాకపోవడంతో పురాల్లో ప్రజలు నీటి ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు.

వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలలో తాగునీటి పథకాల విస్తరణకు ఏఐఐబీ నిధులు మంజూరు చేసింది. ఈ మునిసిపాల్టీలో ఉన్న నీటి పథకాలను పూర్తి స్థాయిలో రానున్న 25 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచానా వేసి ఇందుకు అనుగుణంగా ఆధునీకీకరణ పనులు చేపట్టారు. ఐదేళ్ల గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడనే ఉన్నాయి. సదరు బ్యాంకు రుణం 70 శాతం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాధనంగా కేంద్ర ప్రభుత్వం ఒప్పందం చేసింది. బ్యాంకు నుంచి విడుదలైన నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు జమయ్యాయి. ఈ నిధులు విడుదలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా ధనం కూడా విడదల చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వకపోగా బ్యాంకు విడుదల చేసిన నిధులను వినియోగించుకుంది. చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు నీటి పథకాల పనులు పూర్తిగా నిలిపివేశారు. బిల్లుల బకాయిలు చెల్లిస్తేనే పనులు ముందుకు సాగే పరిస్థితి.

ఏఐబీ నిధులతో ఆయా మునిసిపాల్టీలలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం తెలుగుదేశం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించి టెండర్లు నిర్వహించి పనులను చేపట్టింది. నీటినిల్వ చెరువుల ఆధునికీకరణ, పైపులైన్ల నిర్మాణం, నీటి సరఫరాకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, నీటిశుద్ధి ప్లాంట్ల విస్తరణ వంటి పనులను చేపట్టారు. ఈ పనులు ముందుకు సాగకపోవడంతో వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల మునిసిపాల్టీలలో తాగు నీటి ఎద్దడి నెలకొంది.

వినుకొండ, పిడుగురాళ్ళ, మాచర్ల మునిసిపాల్టీలలో సుమారు రూ.295 కోట్లలో నీటి పథకాల పనులు చేపట్టారు. మాచర్ల మునిసిపాల్టీలో సుమారు రూ.55 కోట్ల వ్యయంతో పనులు చేపట్టగా 10 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. పిడుగురాళ్ళ మునిసిపాల్టీలో రూ.102 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఇక్కడ మూడు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఈ పనులు 20 శాతం కూడా పూర్తి కాలేదు. వినుకొండలో రూ.138 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. ఇక్కడ కూడా 20 శాతం లోపే పనులు పూర్తయ్యాయి. మూడు మునిసిపాల్టీలలో పైపులైన్ల నిర్మాణం కొంత మేర పూర్తి చేశారు. ఈ పనులు కూడా అర్ధాంతరంగా నిలిచిపోవడం గమనార్హం.

చిలకలూరిపేట మునిసిపాల్టీలో అమృత్ పథకం కింద తాగునీటి పథకం విస్తరణ చేపట్టారు. ఈ పనులు నిలిచిపోయాయి. ఈ పథకంలో భాగంగా సాగర్ గుంటూరు బ్రాంచ్ కెనాల్ రెగ్యులేటర్ నుంచి చిలకలూరిపేట చెరువులను నింపేందుకు పైపులైన్ నిర్మాణం చేపట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పైపులైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. 42 కిలోమీటర్ల పొడవున పైపులైన్ నిర్మించాలి. 10 కిలోమీటర్లు పొడవున పైపులైన్ పనులను అప్పట్లోనే పూర్తిచేశారు. ఇంకా 32 కిలోమీటర్ల లైన్ నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు నిధుల కొరత నెలకొంది. పైపులైన్ నిర్మాణానికి రూ.80 కోట్లు వ్యయం అవుతుంది. మునిసిపాల్టీ వాటా ధనం కింద రూ.15 కోట్లు బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ధనం చెల్లించలేదు. రూ.63 కోట్లు పైపులైన్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం స్పందించలేదు. ఈ నిధులు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి గత ఏడాది చిలకలూరిపేట పర్యటనలో హామీ ఇచ్చారు. ఈ హామీ నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఈ మునిసిపాల్టీలో రెండు రోజులకు ఒక పూట మాత్రమే తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులైన్ నిర్మాణం పూర్తయితేనే ఈ మునిసిపాల్టీలో తాగునీటిని పుష్కలంగా సరఫరా చేసే అవకాశం ఉంది. తాగునీటి సమస్యలు పరిష్కరించాలని పుర పౌరులు కోరుతున్నా వీరి మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు.



పిడుగురాళ్లలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు



వినుకొండలో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు

Sitaram Jindal Foundation Scholarship Scheme



Description: Sitaram Jindal Foundation Scholarship Scheme 2024 is an initiative by the Sitaram Jindal Foundation (NGO), for students from Class 11 to the postgraduate level. It aims to provide financial assistance to underprivileged students pursuing various degree/diploma courses.
Eligibility: Open to students currently enrolled in Class 11, 12, ITI, diploma, undergraduate, or postgraduate degree programs. Applicants must have met the minimum percentage requirement in their previous qualifying exam.
Prizes & Rewards: Up to 3,200 per month
Last Date to Apply: Round The Year
Application mode: By post to: The Trustee, Sitaram Jindal Foundation, Jindal Nagar, Tumkur Road, Bengaluru - 560073
Short Url: www.b4s.in/aj/SJS2

SCHOLARSHIP ALERT

Ujjivan Small Finance Bank Transgender Scholarship

Description: Ujjivan Small Finance Bank Limited invites applications from transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/ private open schools or open universities.
Eligibility: Open to transgender students who are currently studying in Classes 9 to 12 or pursuing UG/PG courses from any government/private open schools or open universities. Students must have scored at least 50% marks in the previous academic year. Annual family income of the applicants must not exceed INR 10,00,000.
Prizes & Rewards: Scholarship up to INR 40,000 *Last Date:* 30-04-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/USFB1

University of Kent India Women in Leadership Scholarship 2024

Description: University of Kent India Women in Leadership Scholarship 2024 is an opportunity offered by the Uni versity of Kent to female applicants who have received a conditional offer to pursue a postgraduate course at the university.
Eligibility: Open for female students from and domiciled in India. Applicants must have received a conditional or unconditional offer for a full-time taught master's degree programme by the deadline.
Prizes & Rewards: 50% of the tuition fees for one year of study
Last Date to Apply: 24-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/LPUK1

buddy4study.com

దిక్సూచి DIKSUCHI

ఇంటర్‌తో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎగ్జామ్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సి) నుంచి భారీ నోటిఫికేషన్ వెలువడింది. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్ష తరవాత అత్యంత ఆదరణ కలిగిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సిహెచ్ఎస్ఎల్)-2024 కోసం ఎస్ఎస్‌సి ప్రకటనను విడుదల చేసింది. ఈసారి సిహెచ్ఎస్ఎల్ ద్వారా **3,712** పోస్టులను భర్తీ చేయనున్నారు.

భర్తీ చేసే పోస్టులు

1. లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్
2. డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో)
3. డేటా ఎంట్రీ ఆపరేటర్(గ్రేడ్-ఎ)

అర్హత: ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 1 నాటికి ఇంటర్ ఉత్తీర్ణులయ్యే అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కన్సూమర్ అఫైర్స్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ మినిస్ట్రీ, కల్చర్ మినిస్ట్రీలో డేటా ఎంట్రీ పోస్టులకు మాత్రం ఇంటర్‌లో సైన్స్ గ్రూప్‌తో మేథ్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
వయసు: 2024 ఆగస్టు 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; దివ్యాంగులకు 10-15 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.
ఎంపిక విధానం: అభ్యర్థులను మూడు దశల్లో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈ మూడు దశలను టైర్-1, టైర్-2, స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌గా వ్యవహరిస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **వెబ్‌సైట్:** ssc.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/0U9xCcMలో చదవండి.

నిట్ దుర్గాపూర్‌లో ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ

దుర్గాపూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యు), మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) ప్రోగ్రాములలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రతి కోర్సులో సంస్థ నిర్దేశించిన నిబంధనల ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.
ఎంఎస్‌డబ్ల్యూ: ఇది రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. మొత్తం 15 సీట్లు ఉన్నాయి. అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు.
ఎంబీఏ: కోర్సు వ్యవధి రెండేళ్లు. మొత్తం 44 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 17, ఓబీసీలకు 11, ఎస్టీలకు 3, ఎస్సీలకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 4, దివ్యాంగులకు 3 సీట్లు ప్రత్యేకించారు. అకడమిక్ ప్రతిభ, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 7
- **అడ్మిషన్స్:** జూలై 3
- **ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 27
- **తరగతులు ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** nitdgp.ac.in

హ్యాట్రిక్ హిట్ కోసం..



విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలు ఘన విజయం సాధించాయి. హ్యాట్రిక్ హిట్ కోసం వీరిద్దరూ మళ్లీ జత కట్టారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించే ఈ సినిమా వివరాలను ఉగాది సందర్భంగా మంగళవారం వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ ఏడు హిట్స్ అందించిన అనిల్ రావిపూడికి దిల్ రాజు నిర్మాణ సంస్థలో ఇది ఆరో సినిమా కావడం గమనార్హం. హీరో, అతని మాజీ ప్రేయసి, భార్య.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ లవ్ స్టోరీ ఇదని దర్శకనిర్మాతలు చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం వినోదభరితంగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.

టిల్లు మన మనిషి అయిపోయాడు

ఎన్టీఆర్

సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లుస్క్వేర్' మార్చి 29న విడుదలై ఘనవిజయం అందుకుంది. విడుదలైన తొమ్మిది రోజుల్లోనే రూ. 100 కోట్ల గ్రాస్ సాధించిన 'టిల్లు_స్క్వేర్' సక్సెస్ మీట్‌ను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ "సిద్ధూకి సినిమా తప్ప వేరే ఏమీ తెలియదు. నిరంతరం వర్క్ గురించే ఆలోచిస్తుంటారు. ఈ సినిమాతో సిద్ధు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా మన జీవితంలో



కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చారు. ఈ రోజు టిల్లు.. మన ఇంట్లో, మన చుట్టూ తిరిగే మనిషి అయిపోయాడు. నేనిక నవ్వలేను బాబోయ్ అనేంతలా సిద్ధూ నవ్వించారు" అని చెప్పారు. దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడుతూ "ఈ సినిమా 'టిల్లు స్క్వేర్' మాత్రమే కాదు, రాధిక స్క్వేర్ కూడా. ఈ సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశాను. అందుకే ఈ రేంజ్ సక్సెస్ వారికి దక్కింది" అని అన్నారు. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ఈ సినిమా కోసం సిద్ధు ఎంతగా ఎఫర్ట్ పెట్టారో నాకు తెలుసు. టిల్లు పాత్ర ఎప్పటికీ నిలిచిపోతుంది" అని తెలిపారు. చిత్ర కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమాను ఇంతలా ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డ్ ఇంకోటి ఉండదు" అని చెప్పారు. దర్శకుడు రామ్ మల్లిక్ మాట్లాడుతూ "ఈ సినిమా విజయంలో చిత్ర బృందం సమష్టి కృషి ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు విచ్చేశారు.

రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి



రవితేజ తన కెరీర్‌లో 75వ చిత్రం మైలు రాయిని చేరుకోవడానికి సిద్ధమయ్యారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన ల్యాండ్ మార్క్ ఫిల్మ్‌ను ప్రకటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించే ఈ చిత్రం వివరాలు వెల్లడిస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు. దాని మీద 'రవన్న దావత్ ఇస్తుండు.. రెడీ అయిపోండ్రి' అని రాసి ఉంది. దీనిని బట్టి చూస్తే తెలంగాణ నేపథ్యంలో సాగే చిత్రమిదని అర్థమవుతుంది. ఇందులో రవితేజ పేరు లక్ష్మణ భేరి. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రం 'ధూమ్ ధామ్ మాస్ దావత్' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఫొటోగ్రఫీ: కార్తిక్ ఘట్టమనేని, ఎడిటింగ్: నవీన్ నూలి.

ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్



వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకుపోతున్నారు హీరో శ్రీవిష్ణు. ఉగాది సందర్భంగా మంగళవారం ఆయన తన 19వ చిత్రాన్ని ప్రారంభించారు. దిల్‌రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తొలి షాట్‌కి వీవీ వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ఫన్ ఫిల్డ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి జానకిరామ్ మారెళ్ల దర్శత్వం వహిస్తున్నారు. అనూష ద్రోణవల్లి, సీతాకుమారి కొత, గోపాలం లక్ష్మీదీపక్ నిర్మిస్తున్నారు. కోన వెంకట్, బాబీ కొల్లి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: చోటా కె ప్రసాద్, సంగీతం: విజయ్ బులగానిన్, డీఓపి: సాయి శ్రీరామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:వై నాగు.

ఈ జర్నీని ఎంజాయ్ చేశా



అంజలి నటించిన హారర్ కామెడీ చిత్రం 'గీతాంజలి' 2014లో విడుదలై సెన్సేషనల్ హిట్‌గా నిలిచింది. హారర్ కామెడీ మూవీస్‌లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ చిత్రానికి కొనసాగింపుగా వస్తోన్న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' లోనూ అంజలి నటించింది. ఈ సినిమా ఆమెకు 50వ చిత్రం కావడం విశేషం. ఈ నెల 11న హారర్ కామెడీగా తెరకెక్కిన 'గీతాంజలి మళ్లీ వచ్చింది' విడుదలవుతోంది. ఈ సందర్భంగా అంజలి మీడియాతో ముచ్చటించారు.

నా సినిమాలన్నీ దాదాపు జీ అక్షరంతో మొదలవడం యాధృచ్చికం. గీతాంజలి సినిమాకు సీక్వెల్‌ను తీసుకురావాలనే ఆలోచన ఇప్పటిది కాదు. ఈ సినిమా కథను కోన వెంకట్ నాలుగేళ్ల క్రితమే చెప్పారు. కొన్ని అడ్డంకుల వల్ల ఈ ప్రాజెక్ట్ తెరకెక్కడం ఆలస్యమైంది. అన్ని అడ్డంకులను దాటుకొని అద్భుతమైన అవుట్‌పుట్‌తో ఈ సినిమాను పూర్తిచేసినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమా సీక్వెల్ కాబట్టి పాత క్యారెక్టర్స్‌ను మార్చలేం. కాబట్టి కొత్త క్యారెక్టర్స్‌ను స్టోరీలోకి తీసుకువచ్చాం. ఈ సినిమాలో హారర్, కామెడీతో పాటు మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఈ చిత్రం నా 50వ చిత్రం కావడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. అప్పుడే ఇన్ని సినిమాలు చేసేశానా అనిపిస్తుంది. ఒక నటిగా ఈ జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను" అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/461Zp1y లో చదవండి.

నిహారిక కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల సమర్పణలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'కమిటీ కుర్రోళ్లు' అనే టైటిల్ ఖరారు చేశారు. ఉగాది సందర్భంగా ఈ చిత్రం పోస్టర్‌ను హీరో సాయిదుర్గా తేజ్ విడుదల చేసి యూనిట్‌కు అభినందనలు తెలిపారు. నిహారిక మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కమిటీ కుర్రోళ్లు', దామోదర్ స్టూడియోస్ సంస్థతో కలసి నిర్మిస్తున్నా. కొత్తవాళ్లతో ఈ సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా' అన్నారు. ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్న యదు వంశీ మాట్లాడుతూ 'పదకొండు మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. వినోదభరితంగా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు. కొత్త నటీనటులతో పాటు సాయికుమార్, గోపరాజు రమణ, బలగం జయరామ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్, ఫొటోగ్రఫీ: రాజు ఎడురోలు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మన్యం రమేశ్, నిర్మాతలు: పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక.

డిఫరెంట్ కథతో 'షణ్ముఖ'



ఆది సాయికుమార్, అవికా గోర్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తున్నారు. రమేశ్‌యాదవ్, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని నిర్మిస్తున్నారు. ఉగాది సందర్భంగా మంగళవారం ఈ చిత్రం టైటిల్ లోగోను లాంచ్ చేశారు. ఆది సాయికుమార్ మాట్లాడుతూ "కంటెంట్‌ను నమ్మి చేసిన సినిమా ఇది. అందరినీ తప్పక ఆకట్టుకుంటుంది" అన్నారు. దర్శకుడు షణ్ముఖం మాట్లాడుతూ "డిఫరెంట్ కథతో 'షణ్ముఖ' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తయ్యింది" అని చెప్పారు. నిర్మాత రమేశ్ యాదవ్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా కనిపిస్తారు" అని తెలిపారు.

వైభవంగా ఉగాది


ఉగాది పూజల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట, ఏప్రిల్ 9: తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన పండగల్లో ఒకటైన ఉగాది పర్వదినం జిల్లా ప్రజలు మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. వేద పండితుల పంచాంగ శ్రవణంతో అంతటా తెలుగు కళ ఉట్టిపడింది. ఉగాదిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఈ ఏడాదిలో రాశిఫలాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేే ఉత్సుకత అందరిలో కనిపించింది. వేద పండితులు వారి పేరుకు తగ్గట్టు ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దేవాలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు.

నరసరావుపేట లోక్‌సభ టీడీపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానిక ఎన్జీవో కాలనీలోని తన కార్యాలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

సత్తెనపల్లిలోని తెలుగుదేశం కార్యాలయంలో పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఉగాది వేడుకలు జరుపుకున్నారు. పంచాంగ శ్రవణం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఎస్పీ బిందు మాధవ్ జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బంది, అధికారులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం అందరి జీవితాల్లో కొత్త కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మూడు ముక్కలాటకు స్వస్తి పలకాలి

- లేదంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు
- 1575వ రోజుకు రైతుల ఆందోళనలు


బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 9: మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని, బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు మంగళవారం నాటికి 1575వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతులు, మహిళలు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వైసీపీ పాలకులంతా చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా జగన్‌రెడ్డి కళ్లు తెరవకపోతే జీవితంలో మూడు అని చేసిన దుర్మార్గానికి శిక్ష తప్పదని హెచ్చరించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం

ప్రచారంలో పెమ్మసాని చంద్రశేఖర్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్


తక్కెళ్లపాడు ప్రచారంలో కూటమి అభ్యర్థులు పెమ్మసాని, ధూళిపాళ్ల, వారికి బాబు జగ్జీవన్‌రావు చిత్రపటాన్ని అందిస్తున్న స్థానిక టీడీపీ నేతలు

పెదకాకాని, ఏప్రిల్ 9: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, మరో 30 ఏళ్లపాటు సుదీర్ఘ రాజకీయాలు చేస్తానని గుంటూరు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం పెదకాకాని మండలం తక్కెళ్లపాడు, వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు, గోళ్లమూడి, నంబూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వడ్రాణం మార్కండేయబాబు, తళ్ల వెంకటేష్‌యాదవ్, ఉగ్రాల సీతారామయ్య తదితరులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రశేఖర్, నరేంద్రకుమార్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యని శాశ్వతంగా పరిష్కారం చేస్తామన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ పథకం కింద రూ.5లక్షల వరకు పరిమితి ఉండేది, దానిని ఇప్పటి ప్రభుత్వం రూ.3 లక్షల తగ్గించిందని తెలిపారు. నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి తెలిపారు. మహిళలకు మహాశక్తి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని తెలిపారు. వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాల ప్రజలకు శాశ్వతంగా మంచి నీళ్లు అందేటట్టు చేస్తామన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి రాగానే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తిచేసి పంట పొలాలకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడిచేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షులు వెలినేని శ్రీనివాసరావు(బాబు), మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరిశెట్టి వెంకటేశ్వరరావు, బీజేపీ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, పెదకాకాని మండల తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులో భారీ ర్యాలీలో ప్రసంగిస్తున్న పెమ్మసాని, వేదికపై నరేంద్ర, జనసేన ఇన్‌చార్జ్ వడ్రాణం మార్కండేయబాబు

పాత కేసులు తీయండి.. నోటీసులు ఇవ్వండి

- కోడ్ వచ్చినా తీరు మారని పోలీసులు
- అధికార పక్షం సేవలో తరిస్తున్న అధికారులు
- ప్రతిపక్ష నేతలకు నోటీసులు, వేధింపులు
- నాలుగున్నరేళ్ల క్రితం పెట్టిన అక్రమ కేసుల వెలికితీత
- వాటి ఆధారంగా ఎన్నికలకు దూరం చేసే కుట్ర
- కనపర్తిపై ఏకంగా 18 కేసులు.. తాజాగా 6 నోటీసులు

గుంటూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లుగా అధికార పార్టీ సేవలో తరిస్తోందన్న అపకీర్తిని మూటగట్టుకున్న రాష్ట్ర పోలీసు యంత్రాంగం తీరు ఇప్పటికీ మారినట్టుగా లేదు. ఓ వైపు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా, పరిపాలన అంతా ఎన్నికల సంఘం పరిధిలోకి వెళ్లిపోయినా పోలీసులు మాత్రం తమ స్వామిభక్తిని చాటుకుంటూనే ఉన్నారు. ఇప్పటికే గుంటూరు నగరంలో ఇద్దరు నేతలకు నోటీసులు జారీ చేసిన పోలీసు అధికారులు, మిగిలిన టీడీపీ నాయకులపై పెట్టిన కేసులను కూడా తిరగదోడే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఎన్నికల సమయానికి ప్రతిపక్షాలకు చెందిన కీలక నేతలందరినీ అదుపులోకి తీసుకోవడమో, కేసుల పేరుతో ఎన్నికల ప్రక్రియకు దూరం చేయడమో లక్ష్యంగా అధికార పార్టీ ఈ కుట్రలకు పాల్పడుతుందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.


కనపర్తి శ్రీనివాసరావుకు 41ఏ నోటీసులు ఇస్తున్న అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ నరేంద్ర, ఎస్ఐ నాగేశ్వరరావు

కరోనా కేసులకు ఇప్పుడు నోటీసులు

అధికార వైసీపీ కరోనా లాక్‌డౌన్ నిబంధనలను తన స్వప్రయోజనాల కోసం వాడుకున్నట్టు తాజాగా వెలుగు చూస్తున్న కేసులను బట్టి తెలుస్తోంది. లాక్‌డౌన్ నిబంధనల ఉల్లంఘించారన్న పేరుతో ప్రతిపక్ష టీడీపీ నేతలపై ఇష్టారాజ్యంగా కేసులు బనాయించి వాటిని ఇప్పుడు ప్రతిపక్షాలపై ప్రయోగిస్తున్నట్టుగా తెలుస్తోంది. దాదాపు నాలుగేళ్ల క్రితం పెట్టిన కేసులను ఇప్పుడు తిరగదోడి ప్రతిపక్ష నాయకులకు 41ఏ నోటీసులు జారీ చేస్తున్నారు. కేసుల విచారణ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారు. నరేగా వారం రోజుల క్రితం తెలుగుయువత నేతకు 41ఏ నోటీసులు ఇచ్చిన పోలీసులు తాజాగా మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావుకు నోటీసులు అందజేశారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. అసలు తనపై ఆ కేసులు ఉన్నాయని కూడా చాలామంది ప్రతిపక్ష నేతలకు తెలియదు. నోటీసులు ఎందుకిస్తున్నారని ఆరా తీసిన కనపర్తికి ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఆతడిపై అరండల్‌పేట స్టేషన్ పరిధిలో 9 కేసులు, పట్టాభిపురం స్టేషన్ పరిధిలో ఒక హత్యాయత్నం కేసుతో పాటు 3 కేసులు, కొత్తపేట స్టేషన్ పరిధిలో 3, లాలాపేట స్టేషన్ పరిధిలో 1, నగరంపాలెం పరిధిలో 1, నందివెలుగులో 2 కేసులు, మొత్తంగా 19 కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. దీంతో ప్రతిపక్ష పార్టీల్లో కలకలం రేగింది.

ఎన్నికల కమిషన్‌పై నెపం

అధికార వైసీపీ సేవలో తరిస్తున్న పోలీసులను నోటీసులందుకున్న ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తుండడంతో పోలీసులు ఎన్నికల కమిషన్ మీదకు నెపం మోపుతున్నారు. తమకేమీ సంబంధం లేదని, గతంలో ఇచ్చిన పనిచేసిన పోలీసుల కొత్తగా కేసులు నమోదు చేయలేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నోటీసులు ఇవ్వాల్సి వస్తోందని అమాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. కాగా వైసీపీ మంత్రి విడదల రజిని ఒత్తిడితోనే పోలీసులు ఇలా చేస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. గుంటూరు వీధ నమ్మకం లేని మంత్రి, వైసీపీ నేతలు ఇలా ప్రతిపక్షాల చేతులు కట్టేసి అడ్డదారిలో గెలుపొందాలని చూస్తున్నారని వారు విమర్శిస్తున్నారు.


నోటీసులు ఇప్పుడెందుకు ఇస్తున్నారు?: కనపర్తి

కరోనా సమయంలో చేసిన ధర్నాలు, నిరసనలకు పోలీసులు ఇప్పుడు 41ఏ నోటీసులు ఇవ్వడమేమిటని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ప్రశ్నించారు. అరండల్‌పేట స్టేషన్ ఎస్‌హెచ్ఓ నాగేంద్ర, ఎస్ఐ నాగేశ్వరరావులు మంగళవారం కనపర్తిని ఆయన ఇంట్లో కలిసి నోటీసులు జారీ చేశారు. మొత్తం 6 కేసుల్లో ఆయనకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఆయన నిలదీశారు. తనపై 19 కేసులు నమోదైనట్టు పోలీసులు చెబుతున్నారని, మంత్రి రజిని ఒత్తిడితోనే పాత కేసులను బయటకు తీసి నోటీసులు ఇస్తున్నారని అన్నారు. కేసులు, నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని, న్యాయపోరాటం చేస్తానని తెల్చి చెప్పారు.

సాహితీ ప్రగతిని సాధించాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 9: ఆర్థిక, సాంకేతిక ఔన్నత్యంతో పాటు విద్యార్థులు సాహితీ ప్రగతిని సాధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూ దుర్గాప్రసాదు తెలిపారు. సాహితీ సమాఖ్య, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా 27 వసంతాల సాహితీ వసంతోత్సవం మంగళవారం స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వైభవంగా జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వాహకులు రామారావు, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈ మధ్య బెంచ్ వద్ద కేసులను చూస్తుంటే బాధగా ఉందన్నారు. వాటిలో అధిక కేసులు రక్తసంబంధీకులను చంపడం, వృద్ధులను ఆశ్రమాలకు పంపడం చూస్తుంటే మరింత బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్కృతి, సంప్రదాయాలను ముందుతరాలకు అందించాలని, అప్పుడే మానవత్వ సహిత సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. కళలను ఎందుకు ఆదరించాలి, లేనిపక్షంలో జరిగే దుష్పరిణామాలను ఆయన తెలుసు కోవాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేడుకలను ఏర్పాటు చేస్తున్న సాహితీ సమాఖ్య కృషి అభినందనీయం అన్నారు. జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజున శ్రీ రామ పట్టాభిషేకం, విక్రమాదిత్య శాలివాహన రాజ్యాలు ఆవిర్భావం జరిగాయని, ఋషులంత రోజున పండుగ జరుపుకోవడం శుభపరిణామం అన్నారు. అంతకుముందు శ్రీమాన్ గుదిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం సుప్రసిద్ధ పండితులు, ఆదరిణి డాక్టర్.ధూళిపాళ్ల మహాదేవమణికి క్రోధనామ సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. అవార్డు గ్రహీత చంద్ర బోసుకు సత్కారం చేశారు. సాహితీ సమాఖ్య నంలో కేంద్ర సాహిత్య అకాడమీ సరస్వతి సమ్మాన్ కె.శివారెడ్డి, ఐయూఎంఎల్ మహాదేవమణి, సినీ నృత్యదర్శకుడు సుచిత్ర చంద్రబోస్, కవి డాక్టర్. ఆండ్రెళ్లి, శతావధాని డాక్టర్. బులుసు అపర్ణ, యువ అవధాని ఉప్పలధడియం భరత శర్మ, సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్టు కార్యదర్శి పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.


డాక్టర్. ధూళిపాళ్ల మహాదేవమణికి శ్రీక్రోధ నామ సాహితీ పురస్కారం అందజేస్తున్న జస్టిస్ యూ దుర్గాప్రసాదు, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్



వైభవంగా బాజీబాబా ఉరుసు మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షాహిద్ ఆవులియా బాబా దర్గా 536వ ఉరుసు మహోత్సవం మంగళవారం ఉత్సాహ వైభవంగా జరిగింది. పెదకాకానిలో తరలివచ్చిన బాబా భక్తులతో దర్గా ప్రాంగణం జనసంద్రంగా మారింది. దర్గా నుంచి బాజీబాబా గుర్రం పెదకాకాని, వెనిగండ్ల పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం తిరిగి దర్గాలోకి ప్రవేశించారు. బాజీ బాబా దర్గాను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు గంధం పంపిణీ చేశారు. భక్తులు దర్గాను దర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ఈవో షేక్ మస్తాన్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా సుధాకర్

నరసరావుపేట, ఏప్రిల్ 9: నరసరావుపేట కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థిగా పట్టణానికి చెందిన గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ పేరును అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆయన పేరును మంగళవారం ప్రకటించారు. ఆయన నరసరావుపేటలో న్యాయవాద వృత్తిలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు నరసరావుపేటలో పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

ఆశా కార్యకర్త వైసీపీ ప్రచారం



నూజెండ్ల, ఏప్రిల్ 9: మండలంలోని కంభంపాడు గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త మూలవరి రేణుకాదేవి సోమవారం మండలంలోని జరిగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రలో పాల్గొన్నారు. వైసీపీ గుర్తులు ఉన్న టోపీ ధరించి పార్టీ ప్రచారంలో పాల్గొన్నారు. ఇతర పార్టీ నాయకుల గురించి ఆమె మాటలను మాట్లాడటంపై మంగళవారం టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.

వైభవంగా దశావతారునికి పుష్ప యాగం



పెదకాకాని, ఏప్రిల్ 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీదశావతార వెంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అత్యంత వైభవంగా పుష్పయాగం జరిపించారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులచే బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అరటన్నుల 14 రకాల ప్రత్యేక పచ్చి పూలతో ప్రేమాభిషేకం చేశారు. ఉదయం ఐదు నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారి ప్రత్యేక దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయాన్ని కృష్ణా గుంటూరు జిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు దర్శించారు. దశావతార వెంకటేశ్వరస్వామివారికి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనేకమంది ప్రముఖులు ఆలయాన్ని దర్శించి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణాన్ని జరిపించారు.

వలంటీర్లకు టీడీపీలో మంచి భవిష్యత్ : యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం కొనసాగుతున్న వలంటీర్లకు రానున్న టీడీపీ ప్రభుత్వంలో మెరుగైన వేతనాలతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉగాది శుభాకాంక్షలు చంద్రబాబునాయుడు ప్రకటన రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లలో హర్షం వ్యక్తమవుతుందని, వలంటీర్ల కనీస వేతనం రూ.10 వేలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్ ఉన్న వారికి మరికొన్ని అవకాశాలతో ఎక్కువ వేతనం అందజేసేలా చూడటం జరుగుతుందన్నారు. వైసీపీ నేతల మాటలు నమ్మి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొని భవిష్యత్తును పాడుచేసుకోవద్దన్నారు. ఐదేళ్లుగా పనిచేస్తున్న వలంటీర్లకు గౌరవ వేతనం పెంచకుండా ఎన్నో పనులు చేయించుకుంటున్నారన్నారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తుంది. అప్పటి నుంచి వలంటీర్ల ద్వారానే అవ్వ, తాతల ఇళ్లకు వెళ్లి రూ.4 వేల పింఛన్లను అందజేయడం జరుగుతుందన్నారు. వలంటీర్లు ఎవరైనా కూడా రాజీనామాలు చేయవద్దని, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యరపతినేని సూచించారు.

రాబోయే చంద్రన్న పాలనలో ఇంతకు మించి పింఛన్లు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు


ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 9: పెన్షన్ల, సంక్షేమం జగన్ ముఖ్యమంత్రి కాకముందు ఉన్నాయి. దీని పోయిన తరువాత ఉంటాయని చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. ఈ నిజాన్ని దాచి కొంత కాలంగా ఏదో వైసీపీ ఓడిపోతే పెన్షన్లు ఆగిపోతాయని వైసీపీ నేతలు, జగన్ వాళ్ల బ్లూ మీడియా దారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. అబద్ధపు ప్రచారం ద్వారా ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించి భయపెట్టి ఓట్లు దండుకోవాలనే కుట్ర వారి చర్యల్లో కన్పిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో 18వ వార్డులో మంగళవారం ఎన్నికల శంఖారావం, సూపర్ - 6 పథకాలపై ప్రత్తిపాటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వృద్ధుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కుటుంబ సాధికార సారథులు, బూత్ కమిటీ కన్వీనర్లు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎవ్వరూ వైసీపీ, జగన్ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, రానున్న ప్రజా ప్రభుత్వంలో చంద్రన్న ముఖ్యమంత్రిగా ఇంతకు మించి పింఛన్లు, ఇంతకు మించి సంక్షేమాన్ని అందుకుంటారని భరోసా ఇచ్చారు. ఉమ్మడి అభ్యర్థిగా తనను, ఎంపీ పార్లమెంట్ అభ్యర్థిగా శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్, తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన

పెదకాకాని, ఏప్రిల్ 9: పెదకాకాని మల్లన్న సన్నిధిలో జరిగిన ఉగాది వేడుకల్లో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు. మంగళవారం రాత్రి ఆలయానికి చెందిన పాలక మండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఆలయ ఈవో, ఉప కమిషనర్ శ్రీరామవరప్రసాద్‌లు ఉగాది పురస్కారాలను అర్చకులకు అందజేశారు. అర్చకులను సత్కరించి ప్రశంసాపత్రం అందించారు. ఈ కార్యక్రమం అంతా ఆలయ పాలక మండలి ఛైర్మన్ శివశంకరరావు, మరికొందరు పాలక వర్గ సభ్యులు దగ్గరుండి నిర్వహించారు. ఎన్నికల కోడ్ గత నెల 16 నుంచి అమలులోకి రాగా శివాలయంలో ఇప్పటికీ ఆలయ ఛైర్మన్ తన చాంబర్‌లో రూమ్‌లను వినియోగించుకోవడమే కాకుండా ఆలయంలో ఎన్నికల కోడ్ అమలు చేయటం లేదు. దీనిపై పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు అందాయి.

రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరు చోరీ

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండలంలోని రొంపిచర్ల రైల్వేస్టేషన్‌లో కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి చోరీ చేశారు. రెండు గంటల తరువాత సుమారు పదిమంది వ్యక్తులు స్టేషన్ వద్దకు వచ్చి రాళ్లు విసిరారు. అనంతరం మెట్ల పక్కన ఉన్న కాపర్ వైరును దొంగలించి తీసుకు వెళ్లారు. ఈ ఘటనపై సమాచారాన్ని రొంపిచర్ల పోలీసులకు, రైల్వే పోలీసులకు అక్కడ ఉన్న సిబ్బంది తెలిపారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలించి వెళ్లారు.

20 రోజులపాటు జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు - మంగళగిరి మధ్యన రైల్వేట్రాక్ మరమ్మతులు కారణంగా ట్రైన్ నెంబరు.12077 చెన్నై సెంట్రల్ - విజయవాడ జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్ దారి మళ్లిస్తున్నట్టు డివిజన్ మధ్య రైల్వే సీనియర్ డీసీఎమ్ రాకేష్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ రైలు న్యూగుంటూరు రాకుండా తెనాలి నుంచి నేరుగా కృష్ణాకెనాల్ మీదుగా విజయవాడకు చేరుకుంటుంది. అలానే నెంబరు 07464 విజయవాడ - గుంటూరు స్పెషల్ రైలును పైన సూచించిన తేదీల్లో పూర్తిగా రద్దు చేశామన్నారు. నెంబరు.07465 గుంటూరు - విజయవాడ రైలు కూడా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

గిరిజన ద్రోహి సీఎం జగన్

గుంటూరు, ఏప్రిల్ 9: ఎస్టీ కార్పొరేషన్ నిధులు, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. వైసీపీ పాలకులు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, బడుగు, బలహీనవర్గాల సంక్షేమాన్ని నిర్వీర్యం చేసి నయవంచనకు గురి చేశారన్నారు. టీడీపీ హయాంలో 500 జనాభా కలిగిన గ్రామాలను ప్రత్యేక పంచాయితీలుగా ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తే జగన్‌రెడ్డి అధికారం అందులో ఎక్కువ తర్వాత గిరిజన గ్రామాలకు పంచాయితీ నిధులు కేటాయించక పోవటమే కాకుండా సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారన్నారు. గత ఎన్నికల్లో 87 శాతం గిరిజనులు జగన్‌రెడ్డికి ఓట్లు వేసినా ప్రతిఫలం దక్కగా వారిపైనే కేసులు, భౌతిక దాడులు సాధారణమయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో గిరిజన యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అంబేడ్కర్ విదేశీ విద్య పథకం ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్డ ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

జగన్ ఇచ్చిన హామీలకు ఐదేళ్లయిన అతీగతి లేదు

● గురజాల అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: నాటి ప్రతిపక్షనేత, నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 2019కి ముందు జరిగిన ఎన్నికల ప్రచారంలో గురజాల నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలకు ఐదేళ్లయిన నేటికీ అతిగతి లేదని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల సమయంలో పిడుగురాళ్లలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జగన్ పల్నాడు ప్రాంతంలోని చివరి భూములకు సాగునీరు అందించేందుకు లిఫ్టు ఇరిగేషన్లు మంజూరు చేస్తామని చెప్పి ఐదేళ్లయిన ఒకటి కూడా మంజూరు చేయకుండా పల్నాడుకు ఎలా వస్తాడని ప్రశ్నించారు. అంతే కాకుండా వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తురకపాలెం, పిన్నెల్లి, తుమ్మల చెరువు గ్రామాల్లో మైనార్టీలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినందుకా, మహిళలపై అత్యాచారాలకు పాల్పడిన ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఇప్పుడు ఎలా వస్తున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి అక్రమ మైనింగ్‌తో ఎనిమిది మంది చిన్నారులను పొట్టన పెట్టుకున్న, 11మంది టీడీపీ శ్రేణుల హత్యలను ప్రోత్సహించినందుకా జగన్ పల్నాడు వస్తుంది అని యరపతినేని ప్రశ్నించారు. అంతేకాకుండా అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమించుకున్న దిక్కు లేదన్నారు. పిడుగురాళ్లలో సున్న వ్యాపారులపై వైసీపీ నేతలు పెట్టించిన అక్రమ కేసులను ఎత్తివేస్తానని గత ఎన్నికలకు ముందు పిడుగురాళ్లలో జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. పిడుగురాళ్లలో మున్సిపల్ భవనానికి టీడీపీ హయంలోనే రూ.2 కోట్లు మంజూరు చేసిన ఆ నిర్మాణాలు పూర్తి చేయలేక ప్రభుత్వ ఆస్తులను సైతం బ్యాంకులకు తాకట్టు పెట్టిన రుణాలు ఇవ్వలేదన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు పిడుగురాళ్లలో టీడీపీ హయాంలో నిర్మించిన వేలాది టిడ్కో ఇళ్ళు అప్పట్లోనే 75శాతం పనులు పూర్తి చేసినా వైసీపీ అధికారంలోకి వచ్చి 5సంవత్సరాలు అయినా ఇంతవరకు అవి పూర్తి చేయకపోవటం వారి చేతకానితనానికి నిదర్శనమని అన్నారు.



మసీదులో నిర్వహిస్తున్న దువాలో పాల్గొన్న టీడీపీ నేత జూలకంటి శ్రీనివాసరెడ్డి

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ కృషి

● జూలకంటి శ్రీనివాసరెడ్డి

రెంటచింతల, ఏప్రిల్ 9 : గతంలో చంద్రబాబు సీఎంగా వున్నప్పుడు మైనార్టీల కోసం ప్రవేశపెట్టి అమలు చేసిన రంజాన్ తోఫా, దుల్హన్, విదేశీ విద్య లాంటి పథకాలను ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని మళ్లీ సీఎంగా బాబు నాలుగోసారి బాధ్యతలు చేపట్టగానే రద్దు చేసిన పథకాలన్నింటిని పునరుద్ధరిస్తామని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సోదరుడు విద్యావేత్త శ్రీనివాసరెడ్డి హామినిచ్చారు. రెంటచింతల ఎర్రబాలెంలోని మసీదులో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఆయన మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల నుంచి ఈద్గాకు స్థలం లేదని కేటాయించాలని ముస్లింలు కోరగా రెండెకరాల స్థలాన్ని ఇస్తామని హామినిచ్చారు. మూడు మసీదులకు సంబంధించిన వారందరూ దువా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమర్, బుజ్జి, చాంద్‌భాషా, దస్తగిరి, మీరావలి, నాగూర్ వలి, మాజీ ఎంపీటీసీలు రమేష్‌బాబు, రాజ్‌కుమార్, రాయపరెడ్డి, మల్లయ్య యాదవ్, టౌన్ అధ్యక్షుడు రాజారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, శౌరెడ్డి, బొడపాటి రామకృష్ణ, పల్లెర్ల లక్ష్మారెడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, పల్లెర్ల సత్యనారాయణరెడ్డి, సిద్ధయ్య, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాన్ని తగులబెట్టడం పైశాచిక చర్య

నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు దేవదాసు, సుబ్బు



దగ్ధమైన టీడీపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్రోసూరు, ఏప్రిల్ 9: క్రోసూరులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని తగుల బెట్టడం పైశాచిక చర్య అని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు నందిగం దేవదాసు, జడ సుబ్బు అన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దోషులను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం తగలబడ్డ కార్యాలయాన్ని వారు సందర్శించి మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ప్రజల్లో అనేక అపోహలు ఉన్నాయని, సాధ్యమైనంత తొందరగా దోషులను అరెస్టు చేస్తే అపోహలు తొలగిపోతాయని వారు అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రధాన పార్టీ కార్యాలయాలకు రక్షణ కల్పించాలని, లేకపోతే శాంతి భద్రతల పరిస్థితి ఉత్పన్నమవుతుందన్నారు. సీపీఎం జిల్లా నాయకులు గంజిమాల రవిబాబు మాట్లాడుతూ ఎన్నికల తరుణంలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉంటాయని, ఇటువంటి సంఘటనలు జరిగితే తీవ్రమైన పరిణామాలు జరుగుతాయని అన్నారు.

సమష్టిగా పని చేస్తే టీడీపీదే విజయం

● మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్

బెల్లంకొండ, ఏప్రిల్ 9: సమష్టిగా పని చేస్తే తెలుగుదేశాన్నే విజయం వరిస్తుందని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం బెల్లంకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేస్తే రాష్ట్రం సంక్షేమంతో పాటు అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి స్వర్ణయుగం పాలన కావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాలని ఆయన సూచించారు. చంద్రబాబు అందించిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500, ఇంట్లో ఎంత మంది మహిళలు ఉంటే అంత మందికి రూ.1500 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఇసుక పాలసీని ఉచితంగా ఇవ్వటం హర్షణీయమని అన్నారు. 2014 నుంచి 2019 వరకు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ట్రక్కు ఇసుక రూ.1500లకే ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక దోపిడీ జరిగిందని, ట్రక్కు ఇసుక రూ.6 వేలకు చేరిందన్నారు. మళ్ళీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రకటించటం కూలీలకు, భవన నిర్మాణదారులకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, తెలుగుయువత అధ్యక్షుడు సలాం, గ్రామ అధ్యక్షుడు ఇబ్రహీం, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, చిట్టి, పెద హయాం, మాజీ సర్పంచ్ సయ్యద్‌జానీ, సయ్యద్‌జబ్బార్, పీఎస్‌కే రసూల్, పీఎస్‌కే రహీం, పాపయ్య, గురవయ్య, తెల్లమేకల నాగేశ్వరరావు, తెల్లమేకల మల్లికార్జునరావు, బుల్లెక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు వందల మందికి రంజాన్ తోఫా పంపిణీ



ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న సామిత్ చౌదరి

పెదకూరపాడు, ఏప్రిల్ 9: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని లింగంగుంట్ల గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు మేదరమెట్ల సౌమిత్‌చౌదరి మంగళవారం రాత్రి మూడు వందల ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. మండలంలోని పొడపాడు, లింగం గుంట్ల గ్రామాల్లో ఎనిమిది రకాలకు చెందిన పంచదార, జీడిపప్పు, సేమియా, నెయ్యి తదితర వస్తువులను కలిపి పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా క్లాత్ సంచుల్లో అందించారు. ఈ సందర్భంగా సౌమిత్‌చౌదరి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా ఉన్నారని, చిన్న వయస్సు లోనే సేవాగుణాన్ని కలిగిన సౌమిత్‌ను ముస్లింలు కొనియాడారు.

బెదిరింపు రాజకీయాలకు కాలం చెల్లింది

● ఉమ్మడి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి



పార్టీలో చేరిన వారితో బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 9: నియోజకవర్గంలో ప్రశ్నించే వారిని బెదిరించి భౌతికదాడులు చేస్తూ రాజకీయాలు చేసే నాయకులకు కాలం చెల్లిందని కూటమి మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు భారీగా టీడీపీలో చేరారు. టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఆధ్వర్యాన పట్టణంలోని కృష్ణ బలిజ కాలనీకి చెందిన 30ఎస్సీ కుటుంబాలు, మాచర్ల మండలం కొత్తపల్లికి చెందిన 30 ఎస్సీ కుటుంబాలు, పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన 10 కుటుంబాలు, బండారు భాస్కర్‌రావు ఆధ్వర్యాన 15 బీసీ కుటుంబాలు, అంజిరెడ్డి ఆధ్వర్యాన వెల్దుర్తి మండలం గంగలకుంటకు చెందిన 10కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. దాదాపు 100 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ బ్రహ్మారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఈ పాలన నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు యువత, మహిళలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైసీపీ అధికారం చేపట్టాక ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయన్నారు. టీడీపీ హయాంలో ఉచితంగా ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి అండగా నిలిచామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం ఇసుక దోపిడి ప్రారంభించి వేలాది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైసీపీ నేతల దాడుల్లో గాయపడిన వారే పోలీస్‌స్టేషన్లో బాధితులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో సామాజిక పింఛన్లకు సంబంధించిన నిధులను ఖజానాలో అందుబాటులో ఉంచకుండా తమ అనుచరులకు చేయని పనులకు ముందుగానే వేలాది కోట్ల రూపాయల బిల్లులను చేసి పింఛన్లపై వైసీపీ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందన్నారు. వృద్ధులను ఇబ్బందులకు గురి చేసి వారి జీవితాలతో వైసీపీ వికృత క్రీడలు ఆడుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

● పలు గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమాలు



తంగెడలో నిర్వహించిన ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న యరపతినేని రమేష్, చింతపల్లి హసన్ అహ్మద్ తదితరులు

అమరావతి, ఏప్రిల్ 9: తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని మండలపరిధిలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితులచే పంచాగ శ్రవణం చేయించారు. దీంతో పాటు మండలపరిధిలోని ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అచ్చంపేట, ఏప్రిల్ 9: మండలంలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

పెదకూరపాడు, ఏప్రిల్ 9 : మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది పంచాంగ శ్రవణాన్ని మంగళవారం పలు దేవాలయాల ప్రాంగణంలో నిర్వహించారు. మండలంలోని 75 తాళ్ళూరు కోదండ రామాలయంలో తెలుగు సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం గురించి శ్రీనివాసా చార్యులు, శేషా చలపతి శర్మ వివరించారు.

క్రోసూరు, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సరంలో క్రోసూరు మండలంలో మిశ్రమ ఫలితాలు లభిస్తాయని జోతిష్య పండితులు కామేశ్వరశర్మ చెప్పారు. క్రోసూరులోని పురాతన వీరభద్రస్వామి, మల్లిఖార్జున స్వామి దేవాలయాల్లో మండల స్థాయిలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

రెంటచింతల, ఏప్రిల్ 9: ఉగాది పండుగను పురస్కరించుకుని రెంటచింతలలోని వాసవీకన్యకా పరమేశ్వరీ, వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది పండుగ తీపి, చేదు కలయిక అని, కొత్త ఏడాదిలో ప్రజలెందరో సంతోషంగా ఆరోగ్యంగా ఉండాలని, ఉగాది ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని శాస్త్రి ఆకాంక్షించారు.

దుర్గి, ఏప్రిల్ 9: దుర్గి మండలంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం వేళ వేద పండితులు పంచాంగ శ్రవణం గావించారు.

మాచవరం, ఏప్రిల్ 9: మండలంలోని ఆయా గ్రామాల దేవాలయాల్లో గ్రామ పురోహితులు ఉగాది క్రోధి నామ సంవత్సర పంచాంగ పఠనాన్ని మంగళవారం చదివి వినిపించారు. ముందుగా ఆయా గ్రామ దేవాలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి రాశి ఫలాల వారీగా రాబడులు, వ్యయాల గురించి వివరించారు. వేమవరం సీతారామదేవాలయంలో తంగెడ గ్రామ పురోహితులు జానపాటి సీతారామశర్మ పంచాంగ పఠనం చదివి వినిపించారు.

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా పంచాంగ శ్రవణం వినిపించారు. బెల్లంకొండ సిద్ధాంతి పులుపుల వెంకట ఫణికుమార్‌శర్మ పంచాంగాన్ని వినిపించారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, దేవాలయం అధ్యక్షులు కొత్త కృష్ణమూర్తి, కార్యదర్శి మద్దాళి సుబ్బయ్య, భవనాశి యల్లారావు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ముస్లింలు

దాచేపల్లి, ఏప్రిల్ 9: చారిత్రక ప్రసిద్ధి గాంచిన తంగెడ గ్రామంలో మంగళవారం నిర్వహించిన క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం తో చేపట్టిన పంచాంగ శ్రవణానికి ముస్లింలు కూడా హాజరయ్యారు. గ్రామంలోని మర్కస్ మసీదులో పవిత్ర రంజాన్ ఇఫ్తార్‌కు హాజరైన యరపతినేని రమేష్ అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉగాది పంచాంగ శ్రవణానికి ముస్లింలతో కలిసి హాజరయ్యారు. గ్రామ టీడీపీ నాయకులు చింతపల్లి హసన్ అహ్మద్, గ్రామపెద్దలు నారా యణ తదితరులతో కలిసి పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: రాష్ట్రంలో బడుగు బలహీనవర్గాలకు టీడీపీ అధికారంలోకి రావడంతోనే న్యాయం జరుగుతుందని మండల పార్టీ కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు తెలిపారు. గుత్తికొండ గ్రామంలో జయహో బీసీ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీలకు టీడీపీతోనే గుర్తింపు లభిస్తుందని గుర్తుచేశారు. అధికార పార్టీ బీసీలను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకోవడమే తప్ప ఏనాడు ఉపయోగపడలేదని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీసీలు ఐక్యతతో టీడీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయపాటి రామలింగేశ్వరరావు, యడ్లపల్లి నారాయణ, బండ్ల శేఖరయ్య, జోగయ్య, యడ్లపల్లి శివ, మక్కెన రాజు, కేతన బోయిన హనుమంతరావు, పాదర్తి రాజేశ్వరి, పసుపులేటి నరసింహారావు, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం



బ్రాహ్మణపల్లిలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న ఏపీవో వెంకటేశ్వర్లు

రాజుపాలెం, ఏప్రిల్ 9: మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉపాధి పనులు ఏపీవో వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు ప్రారంభించినట్లు ఏపీవో తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సగటు వేతనం రూ.272 నుంచి 300లకు పెంచారని చెప్పారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయాన్నే హాజరుకావలసిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

పెదకూరపాడు, ఏప్రిల్ 9 : రోడ్డు పక్కన ఉన్న గుంతను తప్పించబోయి ఇసుక లారీ బోల్తాపడి డ్రైవర్ గాయాలపాలైన ఘటన పెదకూరపాడు మండలంలోని గారపాడులో మంగళవారం జరిగింది. నరసరావుపేటకు షేక్ మస్తాన్‌వలి ఇసుక లోడుతో నరసరావుపేట వెళ్తూ గారపాడు వద్ద రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న గుంటను తప్పించబోయి లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో మస్తాన్‌వలికి ఎడమ కాలు విరగడంతో స్థానికులు ఆటో ఎక్కించి పంపిస్తుండగా ముప్పాళ్ళ నుంచి 108 అంబులెన్స్ వచ్చి సత్తెనపల్లి మండలంలోని ఫణిదం వద్ద అంబులెన్స్ లోకి ఎక్కించుకొని ఈఎంటీ సాగర్ ప్రథమ చికిత్స అందించి సత్తెనపల్లిలోని ఏరియా వైద్యశాలలో చేర్పించారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 9 : మండలంలోని భృగుబండ గ్రామ పరిధిలోని పొలాల్లో కోడిపందాల స్థావరంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడి చేశారు. రూరల్ సీఐ రాజేష్ కుమార్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా పందాలు నిర్వహిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి ఆరు సెల్‌ఫోన్‌లు, 22 బైక్‌లు, ఒక కోడి, రూ.6,230 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు వారు తెలిపారు.

షిరిడీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

క్రోసూరు, ఏప్రిల్ 9 : క్రోసూరులోని షిరిడీ సాయి బాబా మందిర 24వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు పదివేల మందికి అన్నదాన చేశారు. తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో బాబావారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

కన్నుల పండువగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం

క్రోసూరు, ఏప్రిల్ 9 : క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా క్రోసూరులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో, వీరభద్ర స్వామి దేవాలయంలోను, కొండ మీద నరింహా స్వామి దేవాలయంలోను ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేణుగోపాలస్వామి వారి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు.

నేతి వెంకన్న స్వామి ఆదాయం రూ.10లక్షలు



దేవరంపాడు కొండపై కొలువై ఉన్న నేతి వెంకన్న స్వామి

రాజుపాలెం, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. దేవరంపాడు కొండపై ఉన్న నేతి వెంకన్నస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు వచ్చి స్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని పంచాంగ శ్రవణం బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ సిద్ధాంతి నిర్వహించారు. ఉగా ది పర్వదినాన అన్ని రకాలుగా రూ.10,67,067 వచ్చినట్లు దేవస్థాన ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు.

డయల్ యువర్ డీఎం నేడు

సత్తెనపల్లి, ఏప్రిల్ 9: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 10వ తేదీ బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. సత్తెనపల్లి డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నెంబరులో సంప్రదించాలన్నారు.

తుమ్మలచెరువులో ఇఫ్తార్



తుమ్మలచెరువులో ఇఫ్తార్ విందు ఇస్తున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: తుమ్మలచెరువు గ్రామంలో మంగళవారం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ పాల్గొన్నారు. షేక్ షాజిదా మృతికి నివాళులర్పించిన అనంతరం ఇఫ్తార్‌లో నిఖిల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్‌అలి, గండికోట వెంకటేశ్వ ర్లు, షేక్ సుభాని, గాలి మాణిక్యరావు, కొమ్మా పాండు, షేక్ రంజాన్ వలి, షేక్ నాగుల్ మీరా, జిలాని, సుభాని తదితరులు పాల్గొన్నారు.

వట్టికుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో..

అమరావతి, ఏప్రిల్ 9: టీడీపీ నాయకులు, ఎన్ఆర్ఐ వట్టికుంట శేషగిరిరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ధరణికోట గ్రామంలో రంజాన్ పురస్కరించుకుని ఇఫ్తార్ నిర్వహించారు. కార్యక్రమాన్ని స్థానిక టీడీపీ నాయకులు వట్టికుంట నరసింహరావు, వట్టికుంట భాను, డాక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రారంభించారు. అనంతరము నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వైభవంగా పసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

నకరికల్లు, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్లను మంగళవారం భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చక స్వామి కనేశ్వర శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కుంకలగుంటలో బ్రహ్మంగారి జెండా ఊరేగింపు

నకరికల్లు, ఏప్రిల్ 9 : కుంకలగుంటలో ఉన్న గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఉగాదిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మంగారి జెండాను ఊరేగింపు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

టీడీపీ ప్రజా వేదికలో ఉగాది పంచాంగ శ్రవణం



ఉగాది వేడుకల్లో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ, తదితర నేతలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 9: పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో మంగళవారం డీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. పూజారి చల్లా శ్రీనివాసరావు పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గ ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన శుభాకాంక్షలను తెలియజేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే రాక్షసపాలన పోయి ప్రజాప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందరికీ ఉగాది పచ్చడిని అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్‌లు ఎలినేడి రామస్వామి, కొల్లిపర కాశీ విశ్వనాథం, నాయకులు ఎం పున్నారావు, కే లక్ష్మయ్య, కే రమేష్, పల్లపాటి రాములు, గుంటుపల్లి నాగేశ్వరరావు, బత్తుల వెంకటస్వామి, సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. కార్య క్రమంలో ఎస్‌టీయూ నాయకులు ఎస్ఎం రెహ్మాన్, ఎం అప్పారావుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. ఉగాది వేడుకల్లో సాల్మన్ రాజు, నాగవేణి, కే సురేష్, పీ వెంకయ్య, సీతారామయ్య, కంభాల శ్రీను, తోట రామ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో ప్రవీణ్ సతీమణి లావణ్య ప్రచారం



పెదకూరపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లావణ్య, పార్టీ శ్రేణులు

పెదకూరపాడు, ఏప్రిల్ 9: పెదకూరపాడులో నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. లావణ్య ఇంటింటికి వెళ్తుండగా పలువురు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రచారంలో టీడీపీ శ్రేణులు, తెలుగుమహిళా నేతలు, ముస్లిం యువత అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా ప్రవీణ్‌ను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని లావణ్య ప్రజలను కోరారు.

భాష్యం ప్రవీణ్ సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక

అమరావతి, ఏప్రిల్ 9: నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సమక్షంలో అమరావతిలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆర్ భాస్కర్‌తో పాటు పలువురు కాపు సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నాయకులు కార్యకర్తలను ప్రవీణ్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో పాటు ధరణికోట, అమరావతి గ్రామాల్లోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు టీడీపీ నాయకులు కొండవీటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి కూడా ప్రవీణ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులను రోడ్డున పడేశారు

● టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్



నాయీబ్రాహ్మణుల హామీలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్

రాజుపాలెం, ఏప్రిల్ 9: ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి వచ్చాక నాయీ బ్రాహ్మణులను రోడ్డున పడేశాడని, రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని.. నాయీబ్రాహ్మణుల జీవితాల్లో వెలుగు నింపుదామని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఇనిమెట్ల గ్రామంలో నాయీబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గంగాధర్ హాజరయ్యాడు. మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దాడులు, దౌర్జన్యాలు తప్ప బడుగు బలహీన వర్గాలకు జరిగిందేమీ లేదన్నారు. భావితరాల భవిష్యత్తుకి అనుగుణంగా నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిగా, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులను, నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం నాయీ బ్రాహ్మణుల హామీలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు చంద్రగిరి ఆదిబాబు, కూరపాటి రఘురామయ్య, వెంకాయమ్మ, నరసింహారావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు ప్రకటనతో ఊగిసలాటలో వలంటీర్లు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 9: వలంటీర్ల వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదని, టీడీపీ అధికారంలోకి వచ్చాక మంచి భవిష్యత్తుతో పాటు రూ.10 వేలకు పైగా ఆదాయం వచ్చేలా చేస్తానన్న చంద్రబాబు ప్రకటనతో వలంటీర్లుగా కొనసాగుతున్న వందలాది మంది ఊగిసలాట ధోరణిలో పడ్డారు. ఇప్పటికే వైసీపీ నేతల ఒత్తిళ్లతో కొందరు రాజీనామాలు చేసిన వారంతా చంద్రబాబుప్రకటనతో ఎందుకు చేశామా అన్న మీమాంసలో పడ్డారు. వలంటీర్లను కొనసాగించడంతో పాటు ఇంటివద్దనే ఉంటూ 10వేలకు పైగా ఆదాయం వచ్చేలా చేస్తానన్న చంద్రబాబు ప్రకటనతో పల్నాడు జిల్లాలో వలంటీర్లుగా కొనసాగుతున్న వారంతా లోలోపల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నాయకులు

● హిమామ్, మౌజామ్‌లకు నూతన వస్త్రాల బహూకరణ



పిన్నెల్లిలో హిమామ్, మౌజామ్‌లకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న జడ్పీటీసీ శివయాదవ్, ఎంపీటీసీ భర్త పెద్దసైదా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే జానీ

మాచవరం, ఏప్రిల్ 9: మాచవరం మండలంలో వైసీపీ నాయకులు కోడ్ ఉల్లంఘనలు కొనసాగిస్తునే ఉన్నారు. మంగళవారం స్థానిక వైసీపీ నాయకులు ఆయా గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రార్థనలు చేసే హిమామ్, మౌజమ్‌లకు నూతన వస్త్రాలు అందజేశారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్‌యాదవ్ పంపించిన నూతన వస్త్రాలను స్థానిక వైసీపీ నాయకులు మండలంలోని అన్ని గ్రామాల మసీదులలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శివయాదవ్, ఎంపీటీసీ భర్త చింతపల్లి పెద్దసైదా, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జానీ, ఆయా గ్రామాల వైసీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నకిలీ పట్టాలతో మిద్దెబావి స్థలాలు కబ్జా

● చోద్యం చూస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులోని మిద్దెబావి స్థలాలకు రక్షణ లేకుండాపోయింది. ఫౌండేషన్ వేసిన స్థలాలను టార్గెట్‌గా చేసుకొని వైసీపీ సానుభూతిపరులు రాత్రికి రాత్రి పథకం ప్రకారం ఆక్రమించి విక్రయాలు చేపట్టడంతో నిరుపేదలు లబోదిబోమంటున్నారు. ఈ తంతు గత రెండేళ్ళుగా జరుగుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ఆక్రమదారులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. 99లో ఇచ్చిన పట్టాలను పోలిన నకిలీ పట్టాలను సృష్టించి స్థలం నాదంటే నాదంటూ ఘర్షణకు పాల్పడుతున్నారు. ఇప్పటికే స్థలాలు కోల్పోయిన నిరుపేదలు రక్షణ కల్పించాలని పోలీసుల చుట్టూ తిరిగిన ఫలితం కన్పించలేదు. నకిలీ పట్టాలను చూపి చర్యలు తీసుకోవాలన్న రెవెన్యూ అధికారుల్లో కదలికలు లేదు. దీంతో ఆక్రమదారులు అడ్డూఅదుపు లేకుండా దౌర్జన్యాలతో ఇళ్ళ స్థలాల ఆక్రమణ పరిపాటిగా మారింది. ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నప్పటికి రెవెన్యూ, పోలీస్ అధికారుల కొందరు అండదండలు ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆక్రమణలకు పాల్పడుతున్న ముఠా నుంచి పేదలకు రక్షణ కల్పించాలని ఆప్రాంత వాసులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న కళాపరిషత్ సభ్యులు

యడ్లపాడు, ఏప్రిల్ 9: యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటకోత్సవాలు మూడోరోజు మంగళవారం కొనసాగాయి. సంయుక్త నిర్వహణలో భాగంగా తొలి రెండురోజులు 7, 8 తేదీలలో లింగారావుపాలెంలోని పోసాని సుబ్బారావుచౌదరి కళావేదికపై పోటీలను నిర్వహించారు. కాగా మంగళవారం రాత్రి యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై మూడోరోజు పోటీలను నిర్వహించారు. పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా కళాకారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతి నాటిక ప్రదర్శన అనంతరం హాజరైన ప్రేక్షకుల నుంచి సేకరించిన కూపన్లను లక్కీ డ్రా నిర్వహించి మొత్తం 10మంది విజేతలకు ప్రత్యేక బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో పోపూరి సుబ్బారావు, మానుకొండ ఉపేంద్ర, పోపూరి గంగయ్య చౌదరి, చిట్టినేని లక్ష్మీనారాయణ, నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకరరావు, ముత్తవరపు పద్మారావు, కొడవీడు కళాపరిషత్ సభ్యులు కట్టా శ్రీహరి, తోకల సాంబశివరావు, మల్నేని సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● పిల్లల తప్పుల్ని, తొందరపాటుతనాన్ని సరిదిద్దుతూ, మరో పక్క క్రమశిక్షణ నేర్పుతూ.. ఒక నాన్నగా తనేం చేయగలడో, నాన్న గొప్పతనాన్ని ప్రతి కూతురు, కొడుకు తెలుసుకోవాల్సిన సత్యమని అలాంటి తండ్రి ఉంటేనే ఏ ఇల్లైనా 'ఇంద్రప్రస్థం'లా వెలిగిపోతుందంటూ అభినయ ఆర్ట్స్, గుంటూరువారు ప్రదర్శించిన నాటికను గోపి సత్యప్రకాష్ రచించగా, ఎన్ రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు.

● కడదాకా కలసి భార్యాభర్తలు చేసే ప్రయాణం 'బంధం' నాటిక. వృద్ధాప్యంలో ఈ 'బంధం' మరింత బలపడి ఒకరికోసం ఒకరు ఎలా మిగిలిపోతారో తెలిపుతూ మైత్రీ కళానిలయం, విజయవాడ వారు ప్రదర్శించిన నాటికను మాడుగుల రామకృష్ణ రచించగా, టివి పురుషోత్తం దర్శకత్వం వహించారు.

● కష్టం వస్తే నా తలరాత బాగోలేదు అంటూ, సుఖంగా ఉంటే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే మనిషి నైజంతో జరిగే అనర్థాలపై సాగిన కథనమే 'రాత'నాటిక. ఈ నాటికను కూడా వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారు ప్రదర్శించగా, పొలుసుదాసు శ్రీనివాసరావు రచించి దర్శకత్వం వహించారు.

కోటప్పకొండకు పోటెత్తిన భక్తులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 9: తెలుగువారి నూతనసంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా శైవక్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం క్రోధి నామ సంవత్సరం సందర్భంగా నరసరావుపేట మండలంలోని కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి, ఇసప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో వేద పండితులు దేవాలయాల వద్ద పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ సంవత్సరం సకాలంలో వర్షాలు కురిసి రైతులు సాగుచేస్తున్న పంటలు బాగా పండి రైతుల లోగిళ్ళన్నీ దాన్యపురాశులతో నిండాలని ఆకాక్షించారు.

భారీగా అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార, సిబ్బంది

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 9: భారీ స్థాయిలో రూ.85వేల విలువైన అక్రమ మద్యాన్ని మంగళవారం స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బీ నయనతార మంగళవారం తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం పట్టణంలో తనిఖీలు నిర్వహిస్తుండగా పట్టణంలోని శివుడు బొమ్మ వద్ద పట్టణానికి చెందిన అట్లూరి వెంకటరెడ్డి సుమారు రూ.85వేలు విలువైన 102 అక్రమ మద్యం సీసాలను కలిగి ఉన్నట్టు గమనించామన్నారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏపీ బ్రాహ్మణ అభివృద్ధి సొసైటీ ప్రధాన కార్యాలయం ప్రారంభం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9: నరసరావుపేట పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో మంగళవారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ అభివృద్ధి సొసైటీ ప్రధాన కార్యాలయం ప్రారంభించారు. ప్రముఖ న్యాయవాది గిరిరాజు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిరాజు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రాహ్మణులందరికి అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందుతాయని తెలిజేశారు. ఆర్ధికంగా వెనుకబడిన వారికి వడ్డీలేని రుణాలను అందిస్తామని, సేవా కార్యక్రమాలు ఈ సొసైటీ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ముత్తనపల్లి శివకృష్ణప్రసాద్, కొప్పరపు పురుషోత్తం, రంగావఝల సుబ్రహ్మణ్యం, కోట సాంబశివరావు, బొగ్గరం ఫణి రాజకుమార్, పిల్లుట్ల రమణమూర్తి, కాశీనాధుని సుబ్రహ్మణ్యం, మధుసూదనప్రసాద్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాకీ చెల్లించలేదని దాడి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9: బాకీ చెల్లించాలంటూ టీడీపీ కార్యకర్తపై వైసీపీ సానుభూతిపరుడు దాడిచేసిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే నాగిరెడ్డిపల్లెకు చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడైన పెద్దేటి రాజేష్‌కు సన్నిబోయిన అంకారావు షాపులో బాకీ ఉంది. బాకీ చెల్లించాలంటూ మంగళవారం రాజేష్‌పై దాడికి పాల్పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్‌ను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు రాజేష్ కుటుంబ సభ్యులు తెలిపారు.

రొంపిచర్లలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఎన్నికల ప్రచారం

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండల కేంద్రమైన రొంపిచర్లలో ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం ప్రారంభించారు. తొలుత వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శంకరస్వామి, సాయిబాబా, బ్రహ్మంగారి దేవస్థానం, చౌడేశ్వరిదేవి, రామాలయం, ఆంజనేయస్వామి, వాసవి, తిరుపతమ్మ తల్లి, బొడ్డురాయి వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మసీదు, చర్చిలలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. హైవే వద్ద నుంచి ద్విచక్ర వాహనం ర్యాలీని నిర్వహించారు. అనంతరం బొడ్డు రాయి సమీపంలోని బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తదితరులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 9: పట్టణంలో మంగళవారం పలు చోట్ల ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక సేవా సంస్థ అసిస్ట్‌లో జరిగిన వేడుకల్లో తెలుగు అకాడమీ సభ్యులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొనగా బ్రహ్మశ్రీ ఐనవోలు సీతారామాచార్యులు పంచాంగ పఠనం చేశారు. కార్యక్రమంలో వడ్లమాని రవి, జాష్టి రంగారావు, కేఎస్ఆర్ మూర్తి, ఫాదర్ ఎన్ బాలశౌరయ్య పాల్గొనగా జాష్టి ప్రమీల జ్యోతి ప్రజ్వలన చేశారు. సీఆర్ క్లబ్‌లో రిటైర్డు ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. శనగల హనుమత్‌శాస్త్రి పంచాంగ పఠనం చేశారు.

● ఈపూరు: తెలుగు సంవత్సరాది ఉగాదిని మండలంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు జరిపించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ముప్పాళ్ళలో సాయిమందిరం, మహాస్థూపం 21వ వార్షికోత్సవం వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా షిర్డీసాయిబాబాకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు.

● నూజెండ్ల: మండలంలోని ప్రజలు ఉగాది పండుగను మంగళవారం ఉత్సాహ భరితంగా జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి ఉగాది పచ్చడి తయారీ, దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలను పరస్పరం తెలుపుకున్నారు. దేవాలయాలు, రచ్చబండలు, ప్రధాన కూడళ్ళల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీ అప్పాపురం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయం, రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్నాథ పీఠం, నూజెండ్ల బ్రహ్మంగారి దేవాలయం, శ్రీ లక్ష్మీ చెన్నవ కేశవ, ఆంజనేయ స్వామి ఆలయాలు, ఇతర గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

● వినుకొండ, ఏప్రిల్ 9: శ్రీకోధి నామ సంవత్సరం ఉగాది నామ పండుగను పురస్కరించుకొని భక్తులు పలు దేవాలయాల్లో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని అందజేశారు.

ప్రతి ఇల్లు సంతోషంగా ఉండాలి: మాజీ మంత్రి ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో ప్రతి ఇల్లు సంతోషంగా ఉండాలని, ఇంటింటిపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరాలన్నది తమ ఆకాంక్ష అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆ దిశగా చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచటమే ప్రస్తుతం ప్రతి ఒక్కరి ముందు ఉన్న కర్తవ్యం అన్నారు. మంగళవారం క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రత్తిపాటిని వేద పండితులు ఆయన గృహంలో ఆశీర్వదించారు. పురుషోత్తపట్నం, గణపవరం గ్రామాలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ఈ రోజు పార్టీ ఇంత బలంగా నిలబడి అధికారంవైపు అడుగులు వేస్తుందంటే అందుకు ప్రజల్లో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు నాయుడుపై ఉన్న అభిమానం, నమ్మకాలే కారణం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.అచ్చయ్య, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ జి.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ప్రత్తిపాటిని ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కార్యాలయంలో...

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 9: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కార్యాలయంలో మంగళవారం ఉగాది పూజలు నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పూజలలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర ప్రజలకు శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నరసరావుపేట అసెంబ్లీ, టీడీపీ కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిపీఠాన్ని అధిరోహించాలని, ప్రజాపరిపాలన రావాలని ఆకాంక్షించారు.



ఉగాది వేడుకల్లో జీవీ ఆంజనేయులు దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన, జనసేన పార్టీ నాయకులు శ్రీనివాసరావులను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

పేదరికం లేని రాష్ట్రమే చంద్రబాబు స్వప్నం: జీవీ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9: ఆకలి, పేదరింకం లేని రాష్ట్రమే చంద్రబాబు స్వప్నమని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితుల మంత్రోచ్ఛరణతో జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు నిశంకర శ్రీనివాసరావు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలందించి, ఉగాది పచ్చడి పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో వృద్ధులకు పింఛను పెంచింది చంద్రబాబునాయుడని, మళ్లీ పెంచేది కూడా చంద్రబాబే అని స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వం ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉపాధి కల్పనలోనూ అందరికి న్యాయం చేసింది తెలుగుదేశం ప్రభుత్వంలోనే అన్నారు. పండుగ సందర్భంగా అందరి జీవితాల్లో ఉగాది పండుగ వెలుగులు నింపాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేదపండితుల పంచాంగ పఠంలో పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థకు తెలుగుదేశం వ్యతిరేకం కాదు

● టీడీపీ పల్నాడు జిల్లా అధక్షుడు జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ టౌన్, ఏప్రిల్ 9: వలంటీర్లకు తెలుగుదేశం చంద్రబాబు నాయుడు ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కూటమి ప్రభుత్వం రాగానే వారికి నెలకు 10వేల రూపాయలు గౌరవ వేతనం అందిస్తామని చంద్రబాబునాయుడు ప్రకటనే అందుకు మరో నిదర్శనమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని ఉమ్మడివరం, పిట్టంబండ గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పథకాలను ప్రజలకు వివరించి తనను బలపరచాలని కోరారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి వలంటీర్లకు వ్యతిరేకం కాదని ఆ ముసుగులో చేస్తున్న రాజకీయాల పైనే తాము విబేధిస్తున్నామన్నారు. చంద్రబాబునాయుడు అనేక సందర్భాల్లో తాము వచ్చాక కూడా వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని ఇచ్చిన హామీని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. వారితో వెట్టి చాకిరి చేయించుకోవడం స్వార్థ రాజకీయ ప్రయోజనాలు చూసుకోవడం తప్ప జగన్‌రెడ్డి ఎప్పుడు గౌరవ వేతనం పెంపు, ఇతర సౌకర్యాలు సంక్షేమం గురించి ఆలోచించిన పాపాన పోలేదని విమర్శించారు. ఇప్పుడు కూడా వలంటీర్లు ఎవరూ వైసీపీ మాయలోపడి రాజీనామాలు చేయవద్దని ఆయన కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కష్టం వలంటీర్లదనని ఫలితం జగన్మోహన్‌రెడ్డి అన్నట్లుగా మారిందన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలకు కావల్సినవన్నీ చేసి పెట్టేది వలంటీర్లు అయితే ఆ క్రెడిట్ అంత తమ ఖాతాల్లో వేసుకుంటున్నది జగన్ అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేయాలని జీవీ, మక్కెనలు అందరికి విజ్ఞప్తి చేశారు.



పిట్టంబండలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఎంపీ కృష్ణ దేవరాయలు, చదలవాడ అరవింద బాబు

ముప్పాళ్ళలో 25 కుటుంబాలు టీడీపీ లో చేరిక

ఈపూరు, ఏప్రిల్ 9: మండలంలోని ముప్పాళ్ళలో అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి 25 కుటుంబాల వారు చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ బటన్ నొక్కి ఇంటికి సాగనంపేందుకు మహిళలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్ జగ్గారావు, మాజీ సర్పంచ్ మోదుగుల నరసింహారావు, కంచేటి చంద్రరావు, విడపలపాటి హనుమయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండలంలోని సుబ్బయ్యపాలెంకు చెందిన పలు కుటుంబాలు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి చదలవాడ అరవిందబాబు సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అరవింద మాట్లాడుతూ ఎమ్మెల్యే గోపిరెడ్డి తీరు నచ్చక నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, ఇంటూరి ప్రసాదు, గాడిపర్తి వెంకటరావు, ఇంటూరి వేణు, గాడిపర్తి వెంకటేశ్వర్లు, శాఖమూరి మారుతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అడవి పేరంటాలమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అడవి పేరంటాలమ్మ తల్లి

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 9: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ దేవాలయం వద్ద తిరునాళ్ళ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పాలాభిషేకాలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేక అలంకరణచేసి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరసారెలను కానుకగా సమర్పించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ ట్రస్టుబోర్డ్ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, ఈవో పుణ్యాల వెంకటరెడ్డి వారిని సాదరంగా అహ్వానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని శ్రీకాకతీయ కమ్మవారి అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బ్రాహ్మణ, ఆర్యవైశ్య అన్నదాన సత్రాలతో పాటు యాదవ సంఘం సభ్యులు, శావల్యాపురానికి చెందిన దాట్ల వెంకటేశ్వరరాజు భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ, మతుకుమల్లి ఆర్యవైశ్య యూత్, కొత్తలూరుకు చెందిన కావూరి శ్రీనివాసరావు భక్తులకు తాగునీరు, మజ్జిగ, బాదంపాలు, ద్రాక్షరసం పంపిణీ చేశారు. వినుకొండ రూరల్‌సీఐ సుధాకర్‌రావు, ఎస్ఐ సురేష్‌లు పాల్గొని తిరునాళ్ళలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది తిరునాళ్ళలో వసతులు పర్యవేక్షించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలను రద్దు చేశారు.

వైభవంగా శంకరస్వామి తిరునాళ్ల

రొంపిచర్ల, ఏప్రిల్ 9: మండల కేంద్రమైన రొంపిచర్లలోని శంకరస్వామి తిరునాళ్ళ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలను అర్చకులు నిర్వహించారు. పార్వతిదేవి అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



టీడీపీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

రైతు కూలీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ చారిత్రక నిర్ణయం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 9: రైతు కూలీల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న చంద్రబాబు ప్రకటన చారిత్రక నిర్ణయమని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలోకి పట్టణంలోని 10వ వార్డు వైసీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ షేక్ రవూఫ్, 15 కుటుంబాలు టీడీపీలో ప్రత్తిపాటి నివాసంలో చేరాయి. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ప్రస్తుతం జగన్ పాలనలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో నెలకొన్న సంక్షోభాన్ని చూసిన తరువాతే చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతుకూలీలు, కౌలు రైతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను తీసుకువచ్చి వారిని ఆదుకుంటామని స్పష్టంచేశారు. ఇలాంటి ప్రజాకర్షక విధానాలు చూసిన తరువాత ఎంతోమంది వైసీపీనివీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కౌలు రైతులకు కనీస గుర్తింపుకూడా లేదన్నారు. ఈ విషయాలన్నీ బేరీజు వేసుకొని రైతు బాంధవుడు చంద్రబాబు నాయకత్వాన్ని ప్రతిఒక్కరూ బలపరచాలని ప్రతిపాటి విజ్ఞప్తి చేశారు.

15న పీవో, ఏపీవోలకు శిక్షణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 9: అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు ఈనెల 15న శిక్షణ ఇస్తున్నట్టు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి బీ నారదముని మంగళవారం తెలిపారు. మొత్తం 665మంది సిబ్బందిని పీవోలు, ఏపీవోలుగా నియమించినట్టు ఆయన తెలిపారు. నాదెండ్ల మండలం గణపవరంలో ఉన్న కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం నియమితులైన వారందరూ తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని ఆయన చెప్పారు.



ఒయాసిస్ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన దుస్తులతో చిన్నారులు

60 మంది పేద ముస్లిం పిల్లలకు దుస్తుల పంపిణీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 9: ఒయాసిస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని 60మంది పేద ముస్లిం పిల్లలకు మంగళవారం దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పాటు ఇంటర్మీడియట్ పూర్తిచేసిన పేద విద్యార్థినికి రూ.5వేలు స్కాలర్ షిప్, వైద్య ఖర్చుల నిమిత్తం మరొకరికి రూ.5వేలు అందజేశారు. ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు షేక్ బీబీ జాన్ రూ.40వేలు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ కార్యదర్శి కరణం విజయ, సంధ్య శైలజ, సుబ్బాయమ్మ, శివకుమారి, త్రివేణి, నజీరున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తపై దాడి

మతుకుమల్లి (శావల్యాపురం) ఏప్రిల్ 9: జనసేన కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసి గాయపరచిన సంఘటన మండలంలోని మతుకుమల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మతుకుమల్లి గ్రామానికి చెందిన అడపాల బాల గురునాధం ఇంట్లోకి చికెన్ తెచ్చుకొనేందుకు కారుమంచికి ద్విచక్రవాహనంపై వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు కొందరు బాలగురునాధం వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారుతో గుద్దించడంతో కిందపడ్డాడు. అతని కంటికి, చేతులకు తీవ్ర గాయాలవ్వడంతో అటుగా వస్తున్నవారు వెంటనే స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బాధితుడిని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై శావల్యాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్థానికులు తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావుకు ఘన నివాళి

చిలకలూరిపేట, ఏప్రిల్ 9 : స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చండ్ర రాజేశ్వరరావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, దాని అనుబంధ సంఘాల నాయకులు నాగబైరు రామ సుబ్బాయమ్మ, పేలూరి రామారావు, లలిత కుమారి, భగత్‌సింగ్, మేగబోతుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది, రెడ్డిపేరంటాలమ్మ తిరునాళ్ల

నాదెండ్ల, ఏప్రిల్ 9: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉగాది వేడుకలను ఆయా గ్రామాల్లో నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పూజలు చేశారు. నందికొండ విఘ్నేశ్వర స్వామి దేవాలయం వద్ద దేవాదాయశాఖ ఈవో తులసీదాసు ఆధ్వర్యంలో పూజలుచేసి తరలివచ్చిన భక్తులకు పంచాంగాలు పంపిణీ చేశారు. చిరుమామిళ్ళ కోటేశ్వరస్వామి దేవాలయంలో కస్టమ్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గాలి సుజాత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో పండితులు పంచాంగ పఠనం వినిపించారు. కాగా సాతులూరు గ్రామంలోని రెడ్డిపేరంటాలమ్మ తిరునాళ్ళను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. తరలివచ్చిన భక్తులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడింది. తరలివచ్చిన భక్తులకు పలు సంస్థల ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు తదితరాలను పంపిణీ చేశారు.

రెండు వందల మందికి నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 9: రంజాన్, ఉగాది పండుగలను పురస్కరించుకొని రెండు వందలమంది పేదలకు మంగళవారం కాలిఫోర్నియాలోని ఎన్‌సైల్ ఫౌండేషన్, స్థానిక రత్న లక్ష్మి నరసింగ్ హోం వారు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. మండవ నృపేన్, నిఖిల, డాక్టర్ లావు సతీష్, యూసఫ్ అలీ, కరీమా, డాక్టర్ లావు అరుణ ఈ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండవ నృపేన్ మాట్లాడుతూ అమెరికా, ఇండియాలో తాము ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెరవలి కోటీరావు, సాధినేని హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, మజ్జిగ సరఫరా కేంద్రాల ఏర్పాటు

చిలకలూరిపేట, ఏప్రిల్ 9: వేసవి ఎండలకు ప్రజలు ఇబ్బంది లేకుండా చూసేందుకు పలు సంఘాలు తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలను మంగళవారం నుంచి ప్రారంభించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అవోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్టి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉచిత మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. సుమారు 1200మందికి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఆలపాటి వెంకటరావు, కొలిశెట్టి సతీష్, కేవీఎస్ కృష్ణుడు, కొప్పురావూరి నాగేశ్వరరావు, కే ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర సమైక్య వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మద్ది నగర్, వడ్డెర కాలనీలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు శివయ్య ఆధ్వర్యంలో మంచి నీటి చలివేంద్రం, మజ్జిగ సరఫరా కేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం అంజమ్మ, వీ శ్రీనివాసరావు, డీ హనుమంతరావు, బీ రాము, బీ సాంబశివరావు, పీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.